


తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
ఆదివారం
29 మార్చి, 2026




# కల్తీ కాలం ..

# నోట్లోకి హాలాహలం



# సుకుమార్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో మరో సినిమా

'రంగస్థలం' లాంటి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ తర్వాత వస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్(ఆర్‌సి17) గురించి ఇండస్ట్రీలో ఒక న్యూస్ వినిపిస్తోంది. దర్శకుడు సుకుమార్ ఈ సినిమా కోసం ఒక మైండ్ బ్లోయింగ్ ప్లాన్‌తో సిద్ధమవుతున్నట్లు టాక్. ఈ సినిమా కోసం సుకుమార్ ఒకే కథను రెండు విభిన్న వెర్షన్లలో డెవలప్ చేశారని, అందులో బెస్ట్ వెర్షన్‌ను ఇప్పుడు ఫైనలైజ్ చేసినట్లు సమాచారం. రామ్‌చరణ్ ప్రస్తుతం బుచ్చిబాబు దర్శకత్వంలో రూపొందుతున్న 'పెద్ది'తో బిజీగా ఉన్నారు. 'పెద్ది' తర్వాత చరణ్ కొంచెం గ్యాప్ తీసుకుని సుకుమార్ ప్రాజెక్ట్‌తో బిజీ కానున్నారు. ఈ ఏడాది జులై/ఆగస్టులో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. 'రంగస్థలం'లో చిట్టిబాబుగా చరణ్‌ను కొత్తగా చూపించిన సుకుమార్, ఈసారి అంతకుమించిన పవర్‌ఫుల్ పాత్రను డిజైన్ చేసినట్లు టాక్. ఈ సినిమాకు కూడా రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తుండటంతో మ్యూజికల్ హిట్ గ్యారెంటీ అని అభిమానులు ఆశిస్తున్నారు. మైత్రీ మూవీస్ ఈ సినిమాను నిర్మిస్తోంది. 'ఆర్‌ఆర్‌ఆర్'తో గ్లోబల్ స్థాయిలో క్రేజ్ సంపాదించుకున్న రామ్‌చరణ్, తన 17వ సినిమాతో బాక్సాఫీస్‌వద్ద ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తారో చూడాలి మరి.

తారాతీరం



# శర్వానంద్ జోడీగా పూజా హెగ్డే?

శర్వానంద్ ఈ ఏడాది ఇప్పటికే ఒక హిట్‌ను తన ఖాతాలో వేసుకోగా, ఆయన నుంచి రాబోతున్న 'బైకర్', 'భోగి' చిత్రాలపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఉన్నాయి. ఈ క్రమంలోనే శర్వానంద్ ఒక క్రేజీ ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు ఫిల్మ్ నగర్ వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న వార్తల ప్రకారం.. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో ప్రముఖ దర్శకుడు శ్రీను వైట్లతో శర్వానంద్ జతకట్టబోతున్నారు. ఈ చిత్రానికి 'జార్జ్ కృష్ణ' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నట్లు సమాచారం.

2027 సంక్రాంతి విడుదలే లక్ష్యంగా ఈ సినిమాను ప్లాన్ చేస్తున్నట్లు తాజా సమాచారం.

ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఇందులో శర్వానంద్ సరసన బుట్టబొమ్మ పూజా హెగ్డే నటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పూజా హెగ్డే ప్రస్తుతం విజయ్ సరసన నటించిన తన భారీ తమిళ చిత్రం 'జన నాయగన్' విడుదల కోసం ఎదురు చూస్తోంది. ఒకవేళ ఈ విషయం నిజమైతే, 2022 తర్వాత పూజా హెగ్డే నటిస్తున్న పూర్తి స్థాయి తెలుగు సినిమా ఇదే అవుతుంది. ఈ ప్రాజెక్ట్‌పై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.

ఆదివారం వార్త

29 మార్చి, 2026

## మంచి ముత్యాలు

– ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచించేవాడే రాణించగలడు.. జీవితంలో ప్రయాణించగలడు.

– నిజాయితీగా ఉండటం ఒక కళ. అందరికీ ఈ కళ అబ్బదు.

## కదంబం

'సంఘీ'భావం....5
అకాల వర్షాలతో
అన్నదాతలు కుదేలు

కవర్ స్టోరీ..6
కల్తీ కాలం
నోట్లోకి హాలాహలం

ఈ వారం కవిత్వం.. 11
తాళంచెవి

మహిళల శబరిమల.. 15

కథ..20
ఆకుపచ్చటి అనుబంధం

సంగీత గ్రామం వల్ముట్టి.. 24

ఇంకా...
మొగ్గ
పుస్తక సమీక్ష
వాస్తు
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## వర్షం సంగతులు చెప్తుంది



"వాన రాకడ ప్రాణం పోకడ తెలియదని" సామెత. అది అన్ని సార్లూ నిజం కాదు సుమా. ఎందుకంటే ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ దగ్గరున్న బెహతా బజార్ గ్రామంలోని ప్రజలు ఈ విషయం ససేమిరా ఒప్పుకోరు. కారణం.. వాళ్ల ఊళ్లోని జగన్నాథ ఆలయానికి ఒక ప్రత్యేకత ఉంది. ఈ దేవాలయం వర్షాలు, తుపానుల రాక గురించి రెండు వారాలు ముందుగానే హెచ్చరిస్తుందని ఆ గ్రామస్థుల నమ్మకం. ఎటువైపు నుండి చూసినా గుండ్రని పైకప్పుతో ప్రత్యేక నిర్మాణ శైలితో ఉండే ఈ ఆలయంలో గర్భగుడి చల్లగా మారినా, జగన్నాథ విగ్రహంపైన తడి, నీటిచుక్కలు కనిపించినా అదే వర్షసూచన అని నమ్ముతారు ఆ గ్రామస్థులు. ఆ సమయం నాట్లు వేయడానికి అనుకూలమైన సమయమని వారు భావిస్తారు. దేవాలయం పైకప్పు పూర్తిగా ఎండిపోతే వర్షం ఆగిపోతుందని విశ్వసిస్తారు. ఈ దేవాలయాన్ని ఎవరు ఎప్పుడు నిర్మించారో తెలియదుగానీ ఎన్నో ఏళ్లుగా ఈ గుడిలో ఉండే వాతావరణ పరిస్థితుల ఆధారంగా ప్రజలు వ్యవసాయ పనులు చేసుకోవడం గమనార్హం.

### రోబో షాడోలు

చూడటానికి షాపింగ్ ట్రాలీల్లా కనిపించే ఈ రోబోలను చైనాలో షాడో రోబోలని, ఫాలోయింగ్ రోబోలని అంటారు. షాపింగ్ మాల్స్‌లో దండిగా షాపింగ్ చేసేవారికి ఇవి చక్కగా ఉపయోగపడతాయి. మనం కొనబోయే వస్తువులను మోయాల్సిన అవసరం ఎంతమాత్రం లేదు. ఇందులో ఇంకో విశేషమేమింటే ఏ వస్తువు ఎక్కడ ఉందో కూడా చెబుతాయట ఈ రోబోలు. వీటిని ఉపయోగించడానికి రిమోట్ లాంటివి ఏవీ అవసరం లేదు. షాపింగ్ మాల్‌లోకి వెళ్లగానే మన ముఖాన్ని రిజిస్టర్ చేసుకుంటే ఎంచక్కా అది మన వెనకాలే వచ్చేస్తుందట.

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

## నవ్వుల్... రువ్వుల్...

# ప్యారడీ పాట

"జయం" చిత్రంలోని "అందమైన మనసులో" పాటకు ప్యారడీ..

పల్లవి: అందమైన బతుకులో
పెళ్లిచూపులెందుకో
ఎందుకో.... ఎందుకో.... ఎందుకో....
పెళ్లిచూపులైనచో మూడు ముళ్ల
ఎందుకో.. ఎందుకో..
ఎందుకో....పెళ్ళెందుకో
పీటముడులు పీక చుట్టడానికా ॥అం॥

చరణం: పెళ్లిచూపులప్పుడే తల వంచి తాను
వినయం చూపిందా భామ
తుపాను ముందర ప్రశాంతమదియని
ఇప్పుడు తెలిసేమి ఫలము
ఆలిలాగ వచ్చి నా ఇంట చేరి
తాను కాళిలాగ మారిందమ్మా
జాలి చూపి నేను మౌనాన్ని ఆశ్రయిస్తే
పిరికివాడినంటుందమ్మా ॥అం॥

చరణం: తన బంధువొస్తే వంటలు చేసి
గంటలు గడిపిందా కొమ్మ
నా బంధువొస్తే మంటలు రేపి
భగభగమండిందా బొమ్మ
ఒళ్లమండి నేను ఒక దెబ్బ వెయ్యబోతే
జుత్తు పట్టి లాగిందమ్మా
పెళ్లినాటి పెద్ద పెదరాయుడల్లే వచ్చి
శిక్ష నాకు వేసాడమ్మ. ॥అంద॥

– లోగిశ లక్ష్మీనాయుడు, సింహాచలం



## జోక్స్ కార్నర్

### పెళ్లి చేసారు

ఇరుగు-పొరుగు ఇళ్లల్లో ఉండే ఇద్దరు మహిళలు మాట్లాడుకుంటున్నారు.

"నాకు ఇరవై ఐదు సంవత్సరాల వరకు పిల్లలు పుట్టలేదు తెలుసా" అంది పొరుగింటావిడతో.

"అయ్యయ్యో! మరి ఏం చేసారు?" అంది మొదటి మహిళతో.

"మా అమ్మా నాన్నలు నాకు పెళ్లి చేసారు, మరుసటి సంవత్సరానికి నాకు కవలలు పుట్టారు" అంది సంతోషంగా.

రెండో మహిళ స్పృహ తప్పి పడిపోయింది.

### ఇన్‌కంటాక్స్ వాళ్లేమోనని..

"ఈరోజు ఒక వ్యక్తి వచ్చి నన్ను రోజుకు ఎంత సంపాదిస్తావని అడిగారు" అన్నాడు తోటి భిక్షగాడితో.

"ఎంత సంపాదిస్తున్నానని చెప్పావు మరి..?" అడిగాడు.

"నేనేమీ చెప్పలేదు. ఎందుకంటే అతడు ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసు నుండి వచ్చాడేమోనని అనుమానం వచ్చింది. అందుకే సరైన సమాధానం చెప్పలేదు" అన్నాడు.

### మొబైల్ పిచ్చి

"నువ్వెప్పుడూ చేతిలో ఫోన్ పట్టుకునే తిరుగుతూనే వుంటావు. మరి ఫ్రీగా వున్నప్పుడు ఏం చేస్తావు?" అడిగాడు స్నేహితుడు కరుణాకర్‌ని, ప్రవీణ్.

"నేను ఫ్రీగా వున్నప్పుడు ఫోన్‌ను చార్జింగ్‌లో పెడతాను" అన్నాడు.



"ఒకవేళ ఇంకా టైమ్ దొరికితే అప్పుడు ఏం చేస్తావు?"

"బ్యాటరీ పూర్తయ్యేవరకు చాటింగ్ చేస్తాను" సమాధానమిచ్చాడు గడుసుగా.

ఇక ఏం మాట్లాడతాడు?

### అన్యాయం

"నాకు అన్యాయం జరిగిపోయింది..." అంటూ గగ్గోలు పెట్టింది స్నేహితురాలితో కవితతో, మమత.

"అంత కష్టం ఏమొచ్చింది?" అడిగింది కవిత.

"మా ఆయనతో ఆఫీసులో తన కొలీగ్‌తో తిరుగుతున్నాడని తెలిసింది" అంది.

"ఆ విషయం నీకు ఎలా తెలిసింది? నిజం తెలియకుండా అలా ఒకరి మీద నిందలు వేయకూడదు" అంది, స్నేహితురాలితో.

"మా ఆయన ఓ అమ్మాయితో సినిమా థియేటర్‌లో వున్నప్పుడు నా బాయ్ ఫ్రెండ్ చూసాడు" అని ఠక్కున నాలిక కరుచుకుంది.

'సంఘీ' భావం



# అకాల వర్షాలతో అన్నదాతలు కుదేలు

వ్యవసాయరంగానికి కష్టాలు వీడటం లేదు. ఆరుగాలం కష్టించి పండించిన పంటకు గిట్టుబాటు లభించకపోగా అకాల వర్షాలు మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. సరిగ్గా పంట చేతికి వస్తుందన్న సమయంలో గత మూడు సంవత్సరాలుగా అకాల వర్షాలు శాపంగా మారాయి. ఇటీవల కురిసిన అకాల వర్షాలు రైతన్న వెన్ను విరిచాయని చెప్పుకోవచ్చు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో అకాల వర్షాల నష్టం కొంత అధికంగా ఉంది. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతాల్లో తోటలు దెబ్బతినడం రైతుకు తీరని నష్టాన్ని మిగిల్చింది. వారం రోజుల క్రితం కురిసిన అకాల వర్షాలకు 12 జిల్లాల్లో పంటలు, తోటలు దెబ్బ తిన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. ఇందులో ప్రధానంగా మొక్కజొన్న, మినుము పంటలకు అధిక నష్టం కలిగింది. సుమారు 42 మండలాల్లో తోటలు, పంటలు దెబ్బతిన్నాయి. సుమారు ఏడు వేల హెక్టార్లలో మొక్కజొన్న రెండు నుంచి మూడు వేల హెక్టార్లలో వరి, వెయ్యి హెక్టార్లలో మినుము పంటలు దెబ్బతిన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. అయితే వాస్తవంగా క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తే ఈ నష్టం ఇంకా ఎక్కువగా ఉందని రైతులు వాపోతున్నారు. పంటలతో పాటు అరటి,మామిడి మొ॥ తోటలు దెబ్బతిన్నాయి. వీటితో పాటు కూరగాయల సాగుకు కూడా తీరని నష్టం కలిగింది. పలు ప్రాంతాల్లో చెట్లు పిడుగుపాటుకు గురయ్యాయి.

ఇప్పటికే మార్కెట్‌లో ధర లేక విలవిల్లాడుతున్న టమోటా రైతులు అకాల వర్షాలతో కుదేలయ్యారు. చిత్తూరు, కడప, అనంతపురం, కర్నూలు జిల్లాల్లో టమోటా పెద్ద ఎత్తున సాగు చేస్తారు. హోల్‌సేల్ మార్కెట్లు ఈ ప్రాంతాల్లోనే అధికంగా ఉన్నాయి. ఇక్కడి నుంచి రెండు తెలుగు రాష్ట్రాల్లోని జిల్లాలతో పాటు పొరుగున ఉన్న కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రాలకు టమోటా ఎగుమతి అవుతుంది. ధరలు గణనీయంగా పతనం కావడంతో కనీసం రవాణా ఖర్చులు కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా కురిసిన అకాల వర్షం అన్నదాతలకు అపార నష్టం మిగిల్చింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో కురిసిన వర్షానికి వరి, జొన్న పంటలు దెబ్బతిన్నాయి. పత్తి పంట నేల రాలింది. మామిడి, బొప్పాయి సాగు చేస్తున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మంచిర్యాల జిల్లా వేమనపల్లి, కన్నెపల్లి, నెన్నెల, భీమిని మండలాల్లో పత్తి పంట దెబ్బతిన్నది. ఆసిఫాబాద్ జిల్లాలో పలు ప్రాంతాల్లో వరి పైరు నేలకొరిగింది. ఆసిఫాబాద్ జిల్లాలో జొన్న, మామిడి, బొప్పాయి, పుచ్చ తోటలు దెబ్బతిన్నాయి. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

వాతావరణంలో కలిగిన మార్పులతో ఒక్కసారిగా అకాల వర్షాలు కురుస్తున్నాయి. గతంలో రెండు సీజన్లలో కూడా ఆశించిన మేరకు పంట దిగుబడి రాలేదు. కూరగాయల ధరలు కూడా పతనం అయ్యాయి. సాగుకు పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంటలు నష్టపోతే చెల్లించాల్సిన బీమా సొమ్ము కూడా సక్రమంగా అందడం లేదని వాపోతున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకునే సమయంలో బీమా ప్రిమియంను వసూలు చేస్తున్నారని. అకాల వర్షాల వల్ల నష్టం కలిగితే ఒక్క పైసా కూడా తమకు అందడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వాలు వర్షాలు పడిన వెంటనే హడావిడి చేసి నివేదికలు సిద్ధం చేస్తున్నారు. రైతులకు పంటల వల్ల తీవ్ర నష్టం కలిగిందని పత్రికల్లో కూడా ఫోటోలతో వార్తాకథనాలు ప్రచురితం అవుతున్నాయని అన్నారు. అయితే ప్రభుత్వాల నుంచి ఆశించిన మేరకు సహాయం అందడం లేదని రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారి సీజన్ మొదలైన మరుక్షణం నుంచి అనేక సమస్యలు రైతులను వెంటాడుతున్నాయని పేర్కొంటున్నారు. నాసిరకం విత్తనాలు ఒక సమస్య అయితే ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో ఉండటం లేదని వారు వాపోతున్నారు. ఎంతో కష్టపడి పంట చేతికి వస్తే సరైన గిట్టుబాటు ధర లభించడం లేదని వారు పేర్కొంటున్నారు. బ్యాంకులో తీసుకుంటున్న రుణాలు తీర్చలేని దుస్థితిలో రైతులు ఉన్నారని వారు విచారం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని, పంట నష్టపోతే తగిన పరిహారం చెల్లించాలని, వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

సుంకవల్లి సత్తిరాజు

# కల్తీ కాలం.. నోట్లోకి హాలాహలం

మానవుడు స్వార్థ జీవిగా మారిపోయాడు. స్వార్థమే పరమావధిగా భావించి, మానవత్వం మరచి, విలువలను గాలికి వదిలేసి ధనమే ఇంధనంగా భావించి, బతకడం ఆరంభించాడు. ఇది మానవ జీవన విధానంలో చోటు చేసుకున్న చేటుకాలం. ఎక్కడైతే న్యాయంగా జీవించాలన్న జ్ఞానం మాయమౌతుందో, విలువలతో హుందాగా మెలగాలన్న విచక్షణ కొరవడు తుందో, అక్కడ నైతికతకు చోటుండదు. సక్రమ ఆలోచనలకు తావుండదు.

ఇలాంటి అస్థవ్యస్తమైన అనారోగ్యకరమైన వాతావరణంలో జీవించడానికే మానవుడు మక్కువ చూపించడం ఈ ఆధునిక యుగంలో మానవ ఆలోచనలకు పట్టిన గ్రహణం. ఇంధన కొరత కారణంగా ప్రపంచ దేశాల ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిపోతున్నాయి. కొద్దిరోజులు ఇంధనం లేకపోతేనే విలవిల్లాడుతున్న ప్రపంచం ఆహారం లేకపోతే ఏమైపోతుందో తలచుకుంటేనే భయం కలుగుతుంది.

## కాసుల వర్షం కురిపిస్తున్న కల్తీ

మానవుడు తన మనుగడ సాగించడం కోసం ప్రాణవాయువుతో పాటు ఆహారం, నీరు అత్యంత అవసరం. నీరు, ప్రాణవాయువు సహజ సిద్ధంగా లభిస్తుంది. చమురు పుష్కలంగా లభించే సంపన్న దేశాలు సైతం ఆహారం కోసం ఇతర దేశాల మీద ఆధారపడక తప్పదు. ఇరాన్, అమెరికా, ఇజ్రాయిల్ దాడుల వలన ఆహారం లేక అలమటిస్తున్న గల్ఫ్ దేశాల్లోని ప్రజల ఆర్తనాదాలు మనకిచ్చే సందేశమేమిటి?

మన దేశం పాడి పంటలకు పుట్టినిల్లు. బంగారు పంటలు పండే భారతదేశంలో పశు సంపద కూడా సమృద్ధిగానే ఉంది. అయితే పలు కారణాల వలన వ్యవసాయంతో పాటు పశు సంపద కూడా గణనీయంగా తగ్గిపోతున్నది. స్వచ్ఛమైన పాలు, పెరుగు లభ్యం కావడం లేదు. మార్కెట్లో లభ్యమయ్యే పాలు, పాల ఉత్పత్తులపై నమ్మకం సన్నగిల్లింది. ఇతర నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. అల్పాదాయ వర్గాల ప్రజలకు పెరిగిన ధరలు పట్టపగలే చుక్కలు చూపిస్తున్నాయి. డిమాండ్ పెరిగే కొద్దీ ప్రజల అవసరాలను సొమ్ము చేసుకోవడానికి 'కల్తీ' అనే కాలకూట విషంతో కొంతమంది స్వార్థపరులు కాసుల కోసం కక్కుర్తి పడుతున్నారు. నిత్యావసర వస్తువులను కూడా కల్తీమయం చేసి ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు.

భారతదేశంలో, అందునా తెలుగు రాష్ట్రాల్లోని ప్రజలు తొలిపొద్దు పొడవక ముందే నిద్ర లేచి కాఫీ, టీలు కడుపులో పడితేనేగానీ ఏ పనికీ ఉపక్రమించరు. జీవన పయనం క్షీరంతోనే ప్రారంభం కావడం ఒక ప్రత్యేకత. ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న పాలు,పాల ఉత్పత్తులు ఇప్పుడు కల్తీకి కేరాఫ్ అడ్రస్‌గా మారడం ఆందోళన కలిగిస్తున్నది.

ఇటీవల రాజమండ్రిలో చోటుచేసుకున్న కల్తీ పాల సంఘటనలో పిల్లలు, వృద్ధులతో సహా ఇప్పటి వరకు సుమారు పన్నెండు మంది మృతి చెందారు. ఇథలీన్ గ్లైకాల్ అనే ప్రమాదకరమైన రసాయనం పాలల్లో కలిసిందని, ఈ కారణంగానే పాలు విషతుల్యమై పలు ప్రాణాలు అనంత వాయువుల్లో కలిసిపోయినట్టు ఫోరెన్సిక్ నివేదికలు నిర్ధారించాయి. ఈ రసాయనం పాలల్లో కలవడం వలన మూత్ర పిండాలు దెబ్బతిని పలువురి మృత్యువుకు దారితీసినట్టు చెబుతున్నారు.



ఒక పాల వ్యాపారి ఈ కల్తీ పాలను 106 కుటుంబాలకు సరఫరా చేసినట్టు తేలింది.

అయితే తాము ఎనభై సంవత్సరాల నుండి పాల వ్యాపారం చేస్తున్నామని, యాభై కి.మీ. దూరంలో గల ప్రాంతాల రైతుల వద్ద నుండి పాలు సేకరిస్తున్నామని రాజమండ్రికి చెందిన పాలు, పెరుగు వ్యాపార సంఘం తెలిపింది. పాల సేకరణ, పాడి రైతుల రక్షణ, పాల ప్రమాణాల భద్రత అమలు చట్టం-2023 ప్రస్తుతం..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలులో ఉంది. లైసెన్సు గల పాల సేకరణ కేంద్రాల నుంచే డైరీలు పాలు సేకరించాల్సి ఉంది. పాలలో కల్తీ జరిగితే కఠిన చర్యలు తీసుకునేలా చట్టంలో మార్పులు తీసుకురావాలి.

వర్తమాన పరిస్థితులను పరిశీలించినప్పుడు, కల్తీ అనే పదం వింటుంటేనే ప్రాణభయం వెంటాడుతున్నది. మనం తినే ఆహార పదార్థాల్లోను, ఇతర నిత్యావసర వస్తువుల్లోను అవాంఛనీయమైన ఆరోగ్య పరిణామాలకు దారితీసే రసాయనిక పదార్థాలను గానీ, రంగులను గానీ కలపడాన్ని 'కల్తీ' అని నిర్వచించవచ్చు. కల్తీ అనేది ప్రజల ఆర్థిక బలహీనతను సొమ్ము చేసుకునే వికృత చర్య. అధిక ధరలను మోయలేని ప్రజానీకం తక్కువ ధరకు లభ్యమయ్యే వస్తువుల పట్ల ఆకర్షితులు కావడమే కల్తీ మాఫియాకు మూలకారణం. సర్వసాధారణంగా మార్కెట్లో గిరాకీ ఎక్కువగా ఉన్న నిత్యావసర వస్తువులే కల్తీకి లక్ష్యంగా చేసుకోవడం జరుగుతున్నది. సరఫరా తక్కువగా ఉండి, డిమాండ్ ఎక్కువగా ఉండి, మధ్య, దిగువ తరగతి ప్రజలు కొనలేని స్థితిని ఆసరాగా చేసుకుని సృష్టించిన అనైతికమైన ప్రక్రియకు వినూత్న పర్యాయ పదమే 'కల్తీ'.

పాలు కల్తీ, నీరు కల్తీ, కూరగాయలు, పండ్లు, బియ్యం అన్నీ కల్తీమయమే. కల్తీకి అనర్హమైన వస్తువంటూ ఏదీ లేదు. కల్తీకి వెలకట్టి కొని తెచ్చుకుంటున్నాం. కల్తీని ఆరగించి, శరీర అవయవాలను రోగాలతో నింపి పూర్ణాయుష్షును అల్పాయుష్షుగా మార్చేసుకుంటున్నాం. కల్తీని చవిచూడని ఆహార పదార్థమంటూ ప్రస్తుతం లేనే లేదని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు.

## నిత్యావసరాల కల్తీ

కల్తీరాయుళ్ళ స్వార్థ చింతనకు రెక్కలొచ్చాయి. అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివిలా తయారైన మార్కెట్ వ్యవస్థలో చెమటోడ్చి, కష్టించిన రైతన్న శ్రమ ఫలితమంతా దగాకోరుల భోషాణాల్లో మూలుగుతున్నది. ఆరుగాలం కష్టించిన రైతన్న అప్పుల తిప్పలు పడలేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే– పంటచేలో తయారైన నికార్సయిన సరుకంతా స్వార్థపరుల చేతుల్లో కల్తీగా మారి, కాలకూట విషంలా తయారై జనం ఊపిరి తీయడం అత్యంత ఘోరం, అమానవీయం.



మానవ జీవితమే కల్తీమయమైన దారిలో పయనిస్తున్నది. ప్రస్తుత ప్రపంచంలో ఆద్యంతాలు కనుగొనడం కూడా అసాధ్యమైన అవినీతి ప్రక్రియగా మారిన 'కల్తీ' గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇంతకు ముందే చెప్పినట్టు సంపూర్ణ పౌష్టికాహారంగా పేరొందిన 'పాలు' హానికారకాలతో విషతుల్యమౌతున్నాయి. పాలల్లో పలురకాల టాక్సిన్లు కలపడం ద్వారా ప్రజారోగ్యం పడకేస్తున్నది. మనకు లభిస్తున్న పాలలో 60 శాతం పైగా కల్తీ నిండి ఉన్నది. చిన్న పిల్లలు ఇలాంటి పాలను తాగడం ద్వారా బాల్యంలోనే అనేక రోగాలకు గురౌతున్నారు. పాలలో యూరియా, అమ్మోనియం సల్ఫేట్ వంటి హానికారకాలను కలపడం వలన కేన్సర్, జీర్ణకోశ వ్యాధులు ప్రబలుతున్నాయి. పాల చిక్కదనానికి స్టార్చ్, పాలు త్వరగా చెడిపోకుండా కాస్టిక్ సోడా కలుపుతున్నారు.




కృత్రిమ పాల తయారీలో యూరియా, డిటర్జెంటులను ప్రధానంగా వినియోగిస్తున్నారనే వార్తలు వెలువడుతున్నాయి. బెల్లంలో చాక్ ఫౌడర్, వాషింగ్ సోడా, టీ పొడిలో వాడేసిన టీ పొడి, ఇనుప రజను కలపడం, కాఫీ పొడిలో చింతగింజల పౌడర్‌ను కలపడం, అద్భుతమైన రుచి కోసం చకోరీని కలపడం ద్వారా కాలేయ సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. కందిపప్పులో కేసరిపప్పు కలపడం వలన బ్రెయిన్ కేన్సర్ వంటి వ్యాధులు వస్తున్నాయి.

ఆకర్షణ కోసం ఆహార పదార్థాల్లో కలిపే కృత్రిమ రంగుల వలన లివర్, కిడ్నీవ్యాధులు తలెత్తుతున్నాయి. ఆవాల్లో బ్రహ్మజెముడు, మిరియాల్లో బొప్పాయి గింజలు, కారంలో రంపపు పొడి లేదా ఇటుక చూర్ణం, గోధుమ పిండిలో గంజి పొడి, వేరుశెనగలో పత్తి గింజల నూనె, యాలకుల్లో ఎండిన ఆకుల చూర్ణం వంటి ఇతర పదార్థాలను మిళితం చేసి కల్తీకి పాల్పడుతున్నారు.

కల్తీ గోధుమ పిండి వలన ఉదర సంబంధ వ్యాధులు ఏర్పడుతున్నాయి. పక్వానికి రాని పండ్లను కార్బైడ్ వంటి...



రసాయనాలతో మగ్గబెట్టడం వలన కలిగే దుష్ఫలితాల గురించి అవగాహన చేసుకోవాలి. అధిక ధరలు గల నూనెలను కొనే ఆర్థిక స్థోమత లేకపోవడంతో నాసిరకం నూనెలను తయారీ చేసి విక్రయించడం జరుగుతున్నది. తక్కువ ధర గల నూనెలను సేకరించి, కల్తీ మయం చేసి, ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లతో బ్రాండెడ్ నూనెలుగా విపణిలో చెలామణీ చేస్తున్నారు. ఒకసారి వినియోగించిన నూనెలను మరలా వినియోగించే విధంగా సరికొత్త పద్ధతుల్లో నూనెలను కల్తీ చేస్తున్నారు. మనం ఉపయోగించే నూనెల్లో దాదాపు 10 నుంచి 20 శాతం వరకు కల్తీమయమేనని నిపుణులు చెబుతున్నారు. నెయ్యి కూడా కల్తీమయమైపోతున్నది.

ఇటీవల తిరుపతి లడ్డూ విషయంలో పెద్ద గందర గోళమే జరిగింది. లడ్డూలో నెయ్యి కాకుండా ఇతర రసాయనాలు కలిపారనే ఆరోపణలతో అధికార, విపక్షాల మధ్య వివాదం చెలరేగి, రాజకీయ రూపం సంతరించుకుని ప్రస్తుతం సర్దుమణిగింది.

సార్వత్రిక ద్రావణిగా పేరొందిన నీరు కూడా కల్తీగా మారింది. మనం తాగే నీరు కూడా కల్తీమయమై పెద్ద వ్యాపారంగా మారిపోయింది. పూర్వ కాలంలో చెరువుల్లో, బావుల్లో నీటిని తాగి ఆరోగ్యంగా ఉండే మనం ప్రస్తుతం స్వచ్ఛమైన జలం పేరుతో విక్రయించే నీటిని తాగుతున్నాం. సరైన నాణ్యతా ప్రమాణాలు లేని నీటిని వినియోగించడం వలన ఆరోగ్యకరమైన సమస్యలు తలెత్తుతున్నాయి.

నీటిలో ఉండే ఉప్పు, సీసం వంటి హానికారకాలతో పాటు ఆరోగ్యానికి ఉపకరించే ఖనిజాలు ఆర్.ఓ ప్రక్రియలో తొలగించబడతాయి.

అయితే మన ఆరోగ్యానికి ఉపకరించే కాల్షియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు ఈ శుద్ధ జల ప్రక్రియలో కలపబడతాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా వ్యాపార దృక్పథంతో నీటిని అమ్మడం నేరం. స్వచ్ఛమైన నీటిలో పి.హెచ్.విలువ 7గా ఉంటుంది. వివిధ దేశాల్లో వినియోగించే స్వచ్ఛజలం పి.హెచ్ విలువల్లో స్వల్ప మార్పులు ఉంటున్నాయి.

నీటిలో కాల్షియం లోపిస్తే ఎముకలు బలహీనమౌతాయి. గుండె సక్రమంగా పనిచేయడానికి, ఎముకల ఆరోగ్యానికి కాల్షియం అవసరం. కాల్షియం లోపం వలన ఎముకలు విరిగిపోవడం, మూత్రపిండాల్లో రాళ్ల ఏర్పడడం, కీళ్లనొప్పులు వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. మెగ్నీషియం లోపిస్తే మానసిక పరమైన ఒత్తిడి పెరగడం జరుగుతుంది.



## ఆహార భద్రతా ప్రమాణాలు- కల్తీ నిరోధక చట్టాలు

ప్రపంచ వ్యాప్తంగా ఎన్నో కల్తీ నిరోధక చట్టాలున్నాయి. అమెరికా సింగపూర్, ఫ్రాన్స్, బ్రిటన్, స్పెయిన్ మొదలైన దేశాల్లో ఆహార కల్తీ నిరోధక చట్టాలు కట్టుదిట్టంగా అమలు జరుగుతున్నాయి. సుమారు వందల కోట్ల సంఖ్యలో కల్తీ కేసులు నమోదవుతున్నాయి. ప్రపంచంలో ఆకలి చావులతో ఏటా సుమారు కోటి మంది ప్రజలు చనిపోతుంటే, గాజాలోను, సూడాన్‌లోను సుమారు 3 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆకలి బాధలతో అలమటిస్తున్నారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం ఆహార పదార్థాల్లో కల్తీ వలన ఏటా 4 లక్షల 20 వేల మంది మరణిస్తున్నారని, 600 మిలియన్ల మంది అనారోగ్యం పాలవుతున్నారని అవగతమవుతున్నది. అమెరికా లాంటి అగ్రరాజ్యాల్లో ఆహార భద్రతా ప్రమాణాల కోసం కఠినమైన చట్టాలున్నాయి. ఆహార పదార్థాల్లో కల్తీని గుర్తించే ప్రయోగశాలలు విరివిగా ఏర్పాటు చేయడం వలన అక్కడ కల్తీని అరికట్టడం సులభతరమైనది. మన దేశంలో 1954లో ఏర్పడిన ఆహార కల్తీ నిరోధక చట్టం (PFA) 1955 నుండి అమల్లోకి వచ్చింది.

ఆహార కల్తీని నిరోధించి, సురక్షితమైన ఆహారాన్ని అందించడమే ఈ చట్టం ప్రాథమిక లక్ష్యం. అయితే ఈ చట్టాన్ని రద్దుచేసి 2006వ సంవత్సరాల్లో కల్తీ నియంత్రణ కోసం పలు నిబంధనలు విధిస్తూ ఆహార భద్రతా ప్రమాణాల చట్టం (FSSAI) ఏర్పడింది. అయితే ఇతర దేశాల్లో ఉన్నంత పటిష్ఠమైన యంత్రాంగం మన దేశంలోను, రాష్ట్రాల్లోను లేకపోవడం వలన కల్తీ దందా విపరీతంగా పెరిగిపోయింది. అరకొరగా ఉన్న సిబ్బంది,

చూసీ చూడనట్లు వదిలేసే ఉదాసీనత్వం ప్రజల ఆరోగ్యాన్ని హరిస్తున్నది. జనాభా పెరుగుదల వలన కూడా ఆహార భద్రతకు పెనుముప్పు ఏర్పడింది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా అవసరాలు కూడా పెరిగాయి. దీని కారణంగా అధిక ఆహారోత్పత్తులకు విరివిగా రసాయనాలను, క్రిమి సంహారక మందులను వాడుతున్నాం. అయితే పంట పొలాల్లో నుండి మార్కెట్‌లోకి వచ్చిన అన్ని వ్యవసాయ ఉత్పత్తులు స్వార్థపరుల చేతుల్లో కల్తీగా పరివర్తన చెందడం చూస్తున్నాం. అయితే చట్టాలు పటిష్ఠంగా అమలు కాకపోవడం వలన కల్తీ మాఫియాకు హద్దు, అదుపూ లేకుండా పోతున్నది.

సింగపూర్, జపాన్, స్విట్జర్లాండ్ దేశాలు ఆహార భద్రతా ప్రమాణాల విషయంలో ముందంజలో ఉన్నాయి. భారత్, బంగ్లాదేశ్, నైజీరియా వంటి దేశాల్లో ఆహార భద్రత ప్రమాదంలో ఉంది. భారత్‌లోని కేరళ రాష్ట్రం ఆహార భద్రతా సూచిలో ప్రథమ స్థానంలో ఉండగా పంజాబ్, తమిళనాడు, గోవా, మణిపూర్, సిక్కిం, జమ్మూ కాశ్మీర్, ఢిల్లీ, చండీగఢ్‌లు తర్వాత స్థానాల్లో ఉన్నాయి. మన దేశంలో ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, కేరళం, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కల్తీకి పాల్పడే వారికి కఠిన శిక్షలు విధిస్తున్నారు. మిగిలిన రాష్ట్రాలు కూడా ఇదే పంథాలో పయనించాలి.

భారతదేశంలోని ఆహార భద్రతా ప్రమాణాల చట్టం (FSSAI)లోని సెక్షన్5 ప్రకారం ఫుడ్ అథారిటీ ఒక చైర్మన్‌ను, సి.ఇ.ఓను, ఇతర సభ్యులను కలిగి ఉంటుంది. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పడిన ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ స్వయం ప్రతిపత్తి గల సంస్థ. ప్రజారోగ్యం, భద్రత దీని లక్ష్యం.

భారతదేశంలో ఎన్నో ఆహార కల్తీ నిరోధక చట్టాలున్నాయి.

వీటిన్నింటినీ ఏకీకృతం చేస్తూ, 2006లో ఆహార భద్రతా ప్రమాణాల చట్టం (ఎఫ్.ఎస్.ఎస్.ఎ.ఐ) వచ్చింది. ప్రస్తుతం భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ (FSSAI)కు ఛైర్ పర్సన్‌గా ఐ.ఏ.ఎస్ అధికారిణి శ్రీమతి పుణ్య సలిల శ్రీవాత్సవ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. న్యూఢిల్లీ ప్రధాన కేంద్రంగా ఏర్పడిన ఆహార భద్రతా ప్రమాణాల సంస్థకు ముంబై, చెన్నై, గౌహతి మొదలైన చోట్ల ప్రాంతీయ కార్యాలయాలు ఉన్నాయి. ఆహార కల్తీని పరీక్షించే ప్రయోగశాలలు ఉన్నప్పటికీ వీటి సంఖ్య



పరిమిత స్థాయిలో ఉండడం వలన ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఆహార కల్తీని నిర్ధారించే ప్రయోగశాలలు విరివిగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మన దేశంలో ఇప్పటికే అమలులో ఉన్న చట్టాల ప్రకారం ఆహార పదార్థాల తయారీ నుంచి, అనుమతుల వరకు; పంపిణీ, విక్రయం, నిల్వ వరకూ తగిన జాగ్రత్తలు పాటించాలి.

భారతదేశంలోని ఆహార కల్తీ నియంత్రణ చట్టం 1954, పండ్ల ఉత్పత్తికి సంబంధించిన (ఎఫ్.పి.ఓ) ఆర్డర్1955, మాంసం ఉత్పత్తుల ఆర్డర్ (ఎమ్.ఎఫ్.పి.ఓ) 1973, వెజిటబుల్ ఆయిల్ ఉత్పత్తికి సంబంధించిన ఆర్డర్ 1947.. ఇలా ఎన్నో చట్టాలున్నాయి. నియమ నిబంధనలున్నాయి.

చట్టవిరుద్ధంగా ఆహారాన్ని తయారు చేసినా, నిల్వచేసినా, కల్తీ చేసినా, జైలు శిక్షతో పాటు భారీ జరిమానా విధించే చట్టాలున్నాయి.

కల్తీకి పాల్పడే వారికి 6 నెలల నుండి యావజ్జీవ కారాగార శిక్ష వరకు లక్ష నుండి 5 లక్షల వరకు, కల్తీ నేర తీవ్రత దృష్ట్యా జరిమానా కూడా పెరుగుతుంది. కల్తీ నియంత్రణ చట్టాలు, నిత్యావసర వస్తువుల చట్టం 1955కు తోడుగా వినియోగదారుల రక్షణ చట్టం1986 కూడా ప్రజలకు ఉపకరిస్తుంది.

భారత న్యాయ సంహిత ప్రకారం ఆహార పదార్థాలను, ఔషధాలను కల్తీ చేసివిక్రయిస్తే 6 నెలల వరకు జైలుశిక్ష పడుతుంది. ఆహార భద్రతా ప్రమాణాల చట్టం ప్రకారం ఆహార పదార్థాలు విక్రయించేవారు శారీరక శుభ్రతతో పాటు అంటువ్యాధులకు టీకాలు వేయించుకోవాలి.

## నిరంతర పర్యవేక్షణ, తనిఖీలు అవసరం

ఇటీవలి కాలంలో బయట మనం తింటున్న ఆహార పదార్థాల విషయంలోను, వాటిని వండే విధానాల పైన వస్తున్న వార్తలు భీతి గొల్పుతున్నాయి వండే స్థలాల్లో పరిశుభ్రత అధ్వాన్నంగా ఉంటున్నట్టు వార్తలు వచ్చాయి. కొన్ని చోట్ల మటన్‌లో వేరే మాంసం కలుపుతున్నారని, ఖరీదైన నూనెలంటూ కల్తీ నూనెలను వాడుతున్నట్టు వార్తలు వెలువడుతున్నాయి.

అలాగే చెత్తా చెదారంతో నిండిన అపరిశుభ్రమైన ప్రాంతాల్లో అమ్మే తిను బండారాలపై తనిఖీ అవసరం. అపరిశుభ్రమైన ఆహారం తిన్న తర్వాత రోగాల బారిన పడి, ఆసుపత్రుల పాలవడం కంటే పరిశుభ్రతకు ప్రాధాన్యతనిచ్చే రెస్టారెంట్లలో తినడం మేలు. కల్తీ తిండితో ఆరోగ్యం సమకూరుతుందా?

డబ్బు పెట్టి, రోగాలను కొనుక్కునే వ్యసనం మనకెందుకు? సరదాల పేరుతో కల్తీ పదార్థాలను అధిక ధరలు వెచ్చించి తినడమేమిటి? ఒక్కసారి ఆలోచించాలి. అన్ని హోటళ్ళు, రెస్టారెంట్లకు మనం వంకలు పెట్టలేం. అన్నీ ఒకే తానులో ముక్కలుగా మనం నిర్ధారించలేం. నాణ్యతా ప్రమాణాలకు విలువిచ్చే హోటళ్ళను, రెస్టారెంట్లను మనం తప్పు పట్టలేం. అలాగని అతి నమ్మకం కూడా ప్రమాదమే. హంగులు, రంగులు, ఆర్భాటాలు, ఆశ్చర్యపరిచే ఖరీదైన డెకరేషన్లతో అలరించే ఆహార సౌధాల్లో అద్భుతమైన ఆహారం తింటున్నాం.. అని భ్రమించడం కూడా పొరపాటే. మన కళ్ళే మనల్ని మాయం చేయవచ్చు. మన మితిమీరిన విశ్వాసమే మనల్ని రోగాలకు గురి చేయవచ్చు. సంబంధిత అధికారులు ఆహార పదార్థాల నాణ్యత విషయంలో తరచూ హోటళ్ళను, రెస్టారెంట్లను, ఆరుబయట, రోడ్లపై అమ్ముతున్న టిఫిన్ సెంటర్లను తనిఖీ చేయాలి.

## కల్తీ పదార్థాలు-రోగాలు

కల్తీ ఆహార పదార్థాల వాడకం వలన కేన్సర్, పక్షవాతం, పలురకాల చర్మ సంబంధమైన సమస్యలు ఏర్పడుతున్నాయి. శరీర అవయవాలు చెడిపోయి అకాల మరణాలు సంభవిస్తున్నాయి. కల్తీ ఆహార పదార్థాల నుండి ప్రజలను రక్షించడానికి 1954లో అమల్లోకి వచ్చిన ఆహార కల్తీ చట్టం లక్ష్యాలు నెరవేరలేదు. సరికొత్త చట్టాల ఆవశ్యకత, అమలులో చిత్తశుద్ధి అవసరం. డబ్బు పోయినా సరిపెట్టుకోవచ్చు. ఆరోగ్యాలు చెడి, రోగాలతో ఆసుపత్రుల పాలైతే ఆదుకునే నాథుడెవరు? ఖరీదైన వైద్యానికి తట్టుకోలేక, కిడ్నీలు చెడి, కేన్సర్, అల్సర్, ఉదర, శ్వాసకోశ వ్యాధులు పట్టి పీడిస్తే, వైద్యం చేయించుకునే స్థోమత లేక గతిస్తున్న మధ్య తరగతి ప్రజల దయనీయ గాథలు కంటికి కనబడవు. చిరుప్రాయంలోనే కంటిచూపు పోవడం, పక్షవాతం, గుండె జబ్బులు, కాలేయ సంబంధిత వ్యాధులు ప్రబలుతుంటే భావితరాల భవితవ్యం ప్రశ్నార్థకమౌతున్నది.



కల్తీపై పోరాడే చైతన్యం ప్రజల్లో రావాలి. నిగనిగలాడే సరుకుల్లో నిండా మోసం. నిలువునా ముంచే ద్రోహం అగుపిస్తున్నది. కాసుల కక్కుర్తితో కల్తీకి తెగబడి, మాటల గారడీతో దర్జాగా, దర్పంగా ప్రజల జేబులకు చిల్లుపెట్టే కల్తీ కేటుగాళ్ళ వ్యాపార దందాను నిలువరించడం సాధ్యమా? అవినీతికి-కల్తీకి మధ్య అవినాభావ సంబంధముంది. కల్తీ అనేది అవినీతి వృక్షానికి ఒక శాఖ వంటిది. ప్రజలను మోసం చేసి సంపాదించే ధన, కనక, వస్తు వాహనాలు ప్రజల స్వేదం నుండి దొంగిలించినవే. ప్రజల కష్టార్జితాన్ని దోపిడీ చేసి కోట్లకు పడగలెత్తి, ఆకాశహర్మ్యాలను నిర్మించే కల్తీ వ్యాపారులను కట్టడి చేయడంలో ప్రజలు, ప్రభుత్వాలు విఫలమౌతున్నాయని చెప్పక తప్పదు. కల్తీ మాఫియా విశృంఖల విహారం చేస్తున్నది. పంచభూతాలను తమ కల్తీ సామ్రాజ్యంలో బంధించి కాసుల గలగలల మధ్య, సకల సుఖాలనుభవించే స్వార్థపరులు తాము సంపాదించిన ఐశ్వర్యమంతా అమాయకుల చెమట చుక్కలతో తడిసి తమ భోషాణాల్లో చేరిందనే నిజం గ్రహించాలి.

## ఐ.ఎస్.ఐ, అగ్మార్క్, బిస్, ఎఫ్.పి.ఓ లు

వివిధ రకాల వస్తువుల నాణ్యతా ప్రమాణాలను బట్టి జారీచేసే ఏజెన్సీలు. వస్తువుల నాణ్యతను ధృవీకరించడంలో మరింత పారదర్శకత పాటించడం అవసరం. ప్రపంచంలోను, భారతదేశం లాంటి ఎన్నో దేశాల్లో కల్తీ నియంత్రణ చట్టాలున్నాయి. వీటికి తోడు వినియోగదారుల చట్టాలు ఉండనే ఉన్నాయి. నిత్యావసర వస్తువుల దగ్గర నుండి ఇతర అనేక వస్తువులు కల్తీకి గుర్తై, నకిలీకి నకలుగా మారుతుంటే ప్రభుత్వ యంత్రాంగాలు కల్తీని అరికట్టలేకపోతున్నాయి. ప్రజలు కూడా మా కెందుకులే..! అని కల్తీభూతం నోట్లో హాయిగా నిద్రపోతున్నారు.

ఒకరిద్దరు వ్యక్తులు గానీ కొన్ని సంస్థలు గానీ బాధ్యతాయుతంగా కల్తీ పైన వినియోగదారుల చట్టబద్ధమైన హక్కుల పైన పోరాడితే ఒరిగేదేమీ ఉండదు. ప్రజల భాగస్వామ్యం, సమిష్టి బాధ్యత లేని ఏ ఉద్యమమైనా విఫలంగాక తప్పదు. ఆహార పదార్థాల కల్తీ విషయంలో కూడా ప్రజా స్పందన అవసరం.

ప్రాణాలకు పెను ముప్పుగా ఏర్పడిన కల్తీ మాఫియాను కూకటివేళ్ళతో పెకలించాలి. ప్రపంచ ఆరోగ్య సంస్థ, అన్ని దేశాల ప్రభుత్వ యంత్రాంగాలు కల్తీ వలన ఏర్పడుతున్న ప్రాణహానిని నివారించడానికి పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలి. కాలుష్యం కంటే అతి భయంకరంగా తయారైన ఆహార పదార్థాల కల్తీని అరికట్టకపోతే మున్ముందు ఎన్నో ప్రాణాలు గాలిలో కలిసిపోయే ప్రమాదముంది. ప్రజా చైతన్యం వెల్లివిరియాలి. కల్తీ భూతం కోరలు పెకలించాలి. విద్యార్థులకు బాల్యదశ నుండే ఆహార భద్రతా చట్టం గురించి వివరించాలి. యువతలో బాధ్యత పెరగాలి. కల్తీ పట్ల అప్రమత్తంగా ఉండాలి. కల్తీ విష పరిష్వంగంలో బలైపోతున్న ప్రజానీకం తక్షణం మేల్కొనాలి. ప్రజల్లో చైతన్యం రాకపోతే ఎన్ని చట్టాలున్నా నిరుపయోగమే. నిరర్థకమే. వినియోగదారులు కల్తీపై సమరభేరి మోగించాలి. ✦

# పుస్తక ప్రేమికుడు

అపురూప పుస్తక ప్రేమికుడు, అంకెగౌడను భారత ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించింది. సహజంగా సమాజంలో ఎందరో ప్రేమికులుంటారు. వృక్ష, జంతు, వస్తు ప్రేమికులు ఎందరో ఎంతో వ్యయ ప్రయాసలతో ఎన్నో రంగాలలో సేవలందిస్తుంటారు. ఆ విధంగానే పుస్తకాల్ని, సద్గ్రంథాలను మత సాహిత్య పరంగా, భారత రామాయణాది పౌరాణిక గ్రంథాలను ఆరాధించేవారున్నారు. ఏ మతమైనా గ్రంథాలను నెత్తిన పెట్టుకొనేవారున్నారు. గ్రంథాలయాలు సాక్షాత్తు సరస్వతీదేవి మందిరాలుగా భావించే జ్ఞానాన్వేషకులు ఎందరో ఉన్నారు. "తల్లీ! నిన్ను దలంచి పుస్తకమున్ చేతబూనితన్" అంటూ బాలబాలికలు అక్షరాన్ని తల్లిగా పూజించే సంప్రదాయం వుంది.

సుమారుగా ఇరవై లక్షల పుస్తకాలు సేకరించడం వాటిని పదిలపరచటం, జీవితాశయంగా, పుస్తకాన్ని సర్వస్వంగా ప్రేమిస్తే తప్ప సాధ్యం కాదు. అవినీతిని అరికట్టే అధికారులు దాడుల సందర్భంలో నోట్ల కట్టలు లెక్కించే స్వర్ణాభరణాలు గుర్తించే చిత్ర విచిత్రాలు చూడటం మనకు వింత అనిపించని ఈ రోజులలో, గుట్టలు గుట్టలుగా రెండు భవనాలలో, రెండు అంతస్తులలో ఈ సంపద సర్దినా, చోటు సరిపోక లారీలకొద్దీ పుస్తకాలను టార్పాలిన్‌లు కప్పి వుంచటం ఇంతగా అబ్బురపరుస్తుంది.

అంకెగౌడ సంపన్నుడు కాదు. అతి సామాన్య మధ్య తరగతి కుటుంబీకుడు. కర్నాటక రాష్ట్రంలోని మైసూరు సమీపంలో పాండవపుర అనే గ్రామంలో నివసిస్తున్నారు. డిగ్రీ చదివి మొదట్లో కండక్టర్‌గా పని చేసేవారు. తర్వాత ఫ్యాక్టరీలో పనిచేసారు. వారి ఇల్లు గ్రంథాలయం కాదు. మనకు ఇష్టమైన, కావల్సిన పుస్తకం దొరకటం కష్టం. పుస్తక సేకరణ ఆయన జీవిత లక్ష్యంగా యావజ్జీవితాన్ని పుస్తకానికి అంకితం చేసారు. జీవితంలో ఏదో ఒక మంచి అలవాటు అలవరచుకొని, దాన్ని పెంపొందించుకొంటూ ముందుకు సాగమని చిన్నతనంలో గురువు యిచ్చిన సందేశాన్ని చిత్తశుద్ధితో ఆచరిస్తుండటంతో పుస్తక సేకరణ కొనసాగుతోంది. గత 59 యేళ్లుగా పుస్తకాలు, పోస్టల్ స్టాంప్‌లు, దేశ విదేశాల నాణెముల సేకరణలో నిమగ్నమయ్యారు.



ఈ అపురూప గ్రంథాలయ సేకరణ ప్రతిష్ఠ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రాచుర్యం పొందింది. ఎందరో మేధావులు, విజ్ఞులు అంకెగౌడ ఇంటిని పుస్తక రాజభవనం అంటారు. 5,000కు పైగా నిఘంటువుల కొండ రూపొందింది. తమిళ, తెలుగు గ్రంథాలు లెక్కకు మించి వున్నాయి. వేలాదిగా మహాభారత, రామాయణ, భగవద్గీత యితర కావ్యాలున్నాయి. శంకర, రామానుజ, మధ్వాచార్యుల సద్గ్రంథాలు, ఖురాన్‌లతో పాటు ఆంగ్ల, ఉర్దూ, పారసీ తదితర భాషా గ్రంథాలు భాష, మతం, స్థలం, కులం అన్నింటికీ అతీతంగా లక్షలాదిగా ఈ సేకరణ ఇంతింతై, అంతింతై వ్యాప్తమైంది.

అన్నింటికన్నా అంకెగౌడ ఈ సేకరణ కృషికి కుటుంబంలో సహకారం, అండదండలు లభించటం, భార్య, కుమారుడు, కూడా తండ్రి అడుగుజాడలలో అంకితం కావడం విశేషంగా అనిపిస్తుంది. తమ తదనంతరం ఈ సంపద ఏమవుతుందనో అనే బెంగ ఆ కుటుంబాన్ని వెంటాడుతోంది. 77వ గణతంత్ర దినోత్సవ సందర్భంలో భారత ప్రభుత్వ ఈ అనన్య సామాన్యున్ని 'పద్మశ్రీ'తో గౌరవించటం ఆ కుటుంబానికే కాదు, దేశ విదేశీ పుస్తక ప్రియులకు కొంత ఊరట కలిగిస్తోంది. ప్రశంసలకు, సన్మాన సత్కారాలకు, అభినందనలకు అంకెగౌడకు లోటులేదు. కానీ ఈ సంపదకు వారసులెవరు?

ప్రస్తుత డిజిటల్ సాంకేతిక ప్రపంచంలో పుస్తకం యింకా బతికే వుంది. కానీ స్వరూపం మారిపోతోంది. ప్రచురణలకు లోటు లేదు. కానీ స్వభావం, ఉనికి మారుతోంది. గ్రంథాలయాలున్నాయి, జ్ఞానం, విజ్ఞానం కొత్త రూపం సంతరించుకొని విస్తరిస్తోంది. ఒకప్పటి తాళ తామ్ర పత్ర జ్ఞాన సర్వస్వం పుస్తకాలలోకి ప్రవహించింది. ఈ అనంత జ్ఞానం ఏదో రూపంలో ప్రసరిస్తూనే ఉంటుంది. ప్రాచీన భావజాలం జ్ఞాన, విజ్ఞాన అదృశ్య తరంగాలుగా మానవ మేధస్సు అన్వేషణ కాలచక్ర పరిభ్రమణంలో 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్'గా తెరపైకి వచ్చింది.

'నాను మత్తు నన్న పుస్తకలోక' (నేను, నా పుస్తక ప్రపంచం) అన్న వ్యాసంలో తనను పరిచయం చేసుకొన్న అంకెగౌడను, తెలుగు పాఠక లోకానికి ఇటీవల ప్రముఖ పాత్రికేయ ప్రజాపత్రికాధిపతి సుదర్శన్ పరిచయం చేసారు.

పుస్తకప్రియులు వారి వృత్తికి, ఆసక్తి, భవిష్యత్ ప్రయోజనాల కోసం స్వతంత్రంగా గ్రంథాలయాలు ఏర్పాటు చేసుకొంటారు. అటువంటి వ్యక్తిగత గ్రంథాలయాలు, తదనంతర వారసులకు ఆ అమూల్య సేకరణ ఎలా వినియోగించుకోవాలో, వాటిని ఏం చేయాలో తెలియని పరిస్థితి ప్రస్తుతం నెలకొని వుంది.

1960 దశకంలో ఎమెస్కో ప్రచురణ సంస్థ ఇంటింట స్వతంత్ర గ్రంథాలయాల ఏర్పాటుకు ప్రోత్సాహం అందించింది. ప్రస్తుత ప్రచురణ సంస్థలు అటువంటి ఉద్యమాన్ని చేపట్టవలసిన అగత్యం ప్రస్తుతం తెలుగునాట స్పష్టమవుతోంది.

– యర్రమిల్లి

సింగిల్ పేజి కథ

# తూనీగ-తుంటరిపిల్లోడు

వానలో బాగా తడిసిపోయి కడిగిన ముత్యంలా గుడ్డం పల్లె. ఆ పల్లెకు పడమట దిక్కుగా ఓ గుట్ట ఉంది దాని పేరే గుడ్డంగుట్ట. ఆ గుట్ట కింద ఆ పల్లె ఉండాది, కాబట్టి దాని పేరు గుడ్డంపల్లె అయింది. ఆ పల్లె చుట్టూ పచ్చని పంట పొలాలు, పల్లెకు దక్షిణంగా నిండుకుండలా ఓ పెద్ద చెరువు. చూడ్డానికి కన్నుల పండుగగా ఉండేవి. పారేశు ఇంటి ముందున్న కోళ్ళగూట్లోని గాజుపుంజు రెక్కలు విదిలిస్తూ బయటకొచ్చి కొక్కొరొకో.. అంటూ కూసింది, అంతే! పల్లెంతా నిద్ర లేచింది. పారేశు కూడా గుటకెడు నీళ్ళు పుక్కలించి ఊంచేసి పాసినోరు కడుక్కోని, తుండుగుడ్డతో తుడుచుకుంటూ ఆవుల దొడ్లోని పేడంతా గంపకెత్తుకొని, తుండుగుడ్డ సుట్టసుట్టి నెత్తిన బెట్టుకోని చెరువుకట్ట కింద ఉండే దిబ్బలో యేసేసి వస్తాండాడు. ఇంతలో వాడి ముందొక తూనీగల గుంపొకటి పోతోంది. వాటిని చూడగానే మనోడికి గిలిగింతలు మొదలైనాయి. మనసులో తుంటరి ఆలోచన పుట్టింది. ఆ తూనీగల గుంపు వెంబడి వెళ్తూ వాటిని పట్టుకునే పయత్నం చేసాడు.

కష్టపడి ఒక తూనీగను పట్టేసుకున్నాడు పారేశు. దాంతో వాడిలో ఎక్కడలేని ఆనందం. దాని రెండు రెక్కలు పట్టుకొని గాల్లో గిరగిరా తిప్పుతాండాడు. ఆ తూనీగ పాణం గింజుకొంటాంది. వీడేమో ఆనందపడతాండాడు. దాని రెక్కలు పట్టుకొని "తూనీగా, తూనీగా ఎందాకా నీ పయనం ఎగురు.. ఎగురు పైపైకి ఎగురు తూనీగా" అని పాట పాడుతూ గాలిలో తిప్పుతూ పరుగులు తీస్తాండాడు పారేశు.



గుంపుగా పోతున్న తూనీగలు వీడి తుంటరి పనులకు ప్రాణభయంతో చెల్లాచెదురై పోయాయి. ఇదంతా చెరువు కింద పొలానికి నీళ్లు పెడుతున్న వెంకటసుబ్బయ్య తాత చూసాడు. బావినీళ్ళకు వచ్చిన సత్యమ్మవ్వ నడుము మీద ఒక నీళ్ళ కడవ, నెత్తిన మరో నీళ్ల కడవ పెట్టుకొని పోతూ వీడి ఆగడాలన్నీ గమనిస్తోంది. నిత్యం పశుపక్షాదులతో కలిసి జీవిస్తున్న సుబ్బయ్య తాత, సత్యమ్మవ్వల మనస్సులు బాధగా మూలిగాయి. ఆ తూనీగల మీద జాలి కలిగింది. నోరులేని ప్రాణాలు ఇవి. వాటిని ఇలా హింసకు గురి చేస్తాడా? ఈ తుంటరోడు. వీడికి ఎలా అయినా బుద్ధి చెప్పాలని మనసులో గట్టిగా అనుకున్నారు.

సత్యమ్మవ్వ కూడా "నీకేం పోగాలంరా పారేశూ! ఆ తూనీగలెవరికన్నా కీడు చేస్తాయా? వాటి మానాన అవి పోతాంటే ఇవ్వేం పనులురా?" అని తిడుతోంది సత్యమ్మవ్వ.

"నా ఇష్టం వచ్చినట్లు జేస్తా! మీ పనులు మీరు జూసుకోక మీ బదాయేంది?" అంటూ పెద్దా, చిన్నా లేకుండా తిరగబడి మాట్లాడాడు పారేశు.

ఈ పారేశ్ గాడికి "ఈ పొద్దేం సొగిలి రోగం పుట్టిందో ఏమో! అయినా! ఆ చిన్ని ప్రాణి ఎంతలా గింజుకుం టుందో గదా!" అనుకుంటూ వచ్చిన వెంకటసుబ్బయ్య మంచిగా పారేశు దగ్గరికి పోయి గట్టిగా తొడపాశం పెట్టాడు. "అబ్బా సంపినావుగదరా తాతా!" అంటూ ఏడుపు మొగం పెట్టి వెంకటసుబ్బయ్యను తిట్టిన తిట్టు తిట్టకుండా తిడతాండాడు పారేశు. ఇంతలో సత్యమ్మవ్వ వచ్చి "ఏరా పారేశూ, నొప్పిగా ఉందా నీకు? నీదొక్కడిదే ప్రాణం. తక్కినోళ్ళవివెరివీ ప్రాణాలు గావు అంతేనా? నీకు నోరుందనే గదా అబ్బా నొప్పి అబ్బో నొప్పి అని అరుస్తాండావు. నోరు లేని ఆ జీవికి నొప్పి ఉండదా? తనదాకా వస్తేగానీ తెలీదని" పెద్దోళ్ళు ఊరికే అన్నారా? నీలాంటోళ్ళను జూసే అనింటార్లే!" అంటూ సున్నితంగా మందలించింది.

ఈ తెల్లారి ఎంతో ఆనందంగా ఆకాశంలో సూరిడి లేతలేత కిరణాలు చెట్ల ఆకుల మీద బడి చూడముచ్చటేసిన దృశ్యం కదూ! అందంగా, స్వేచ్ఛగా ఎగిరిపోతున్న ఆ తూనీగల గుంపును చెదరగొట్టితివి. అవి భయంతో దిక్కుకొటి వెళ్ళిపోయాయి! అవి ఎంత ప్రాణభయముతో పారిపోయినాయో ఆలోచించావా? బడికి పోతాండవు కదా! పశుపక్షాదులూ, జీవరాశుల పట్ల దయకలిగి ఉండాలని చెప్పలేదా మీ అయ్యోర్లు" అని ప్రశ్నించాడు వెంకటసుబ్బయ్య తాత.

ప్రాణం ఎవరిదైనా ఒకటే బాబు. కాసింత మానవత్వం ఉండాలబ్బోడా!"

పారేశు ఆలోచనలో పడ్డాడు. అవును.. తాత మన చుట్టూ ఉన్న జీవరాశుల్ని మనం హింసించకూడదు, ప్రేమించాలి. మీరు చెప్పింది అక్షరాలా నిజం తాత. నేను నా జీవితంలో ఇంకెప్పుడూ జీవ హింస చేయనులేవ్వా! నా తప్పును నేను తెలుసుకునేలా చేసిన మీకిద్దరికీ దండాలు" అన్నాడు పారేశు.

"మా బంగారు మనవడు జీవితంలో గొప్పోడు అవుతాడు" అంటూ తమ గుండెలకు హత్తుకున్నారు ఆ ముసలి దంపతులు.

– డా॥ కిట్టన్న నెమిలేటి

# మార్కులే ముఖ్యమా?

మన సమాజంలో విద్యకు చాలా ప్రాధాన్యం ఉంది. విద్య మనిషిని జ్ఞానవంతుడిగా, బాధ్యతగల పౌరుడిగా మార్చే శక్తి కలిగి ఉంది. అయితే, విద్య అసలు ఉద్దేశం జ్ఞానం అందించడం అయినప్పటికీ, నేటి పరిస్థితుల్లో అది ఎక్కువగా 'మార్కులు' అనే ఒకే ప్రమాణానికి పరిమితమవుతోంది. పరీక్షల్లో వచ్చిన మార్కులే విద్యార్థి ప్రతిభను, భవిష్యత్తును నిర్ణయిస్తాయని చాలా మంది నమ్ముతున్నారు. ఈ నేపథ్యంలో ఒక ముఖ్యమైన ప్రశ్న మన ముందుకు వస్తుంది మార్కులు ముఖ్యమా? లేక జీవితం ముఖ్యమా?

మొదటగా మార్కుల ప్రాముఖ్యతను పూర్తిగా నిరాకరించలేం. విద్యార్థి చదివిన విషయాన్ని ఎంతవరకు అర్థం చేసుకున్నాడో కొంతవరకు పరీక్షలు చూపిస్తాయి. మంచి మార్కులు రావడం వల్ల విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు, మంచి కాలేజీలలో ప్రవేశాలు, ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. అందువల్ల మార్కులు విద్యార్థుల జీవితంలో ఒక పాత్ర పోషిస్తాయి. కానీ, మార్కులే జీవితానికి అంతిమ లక్ష్యమని భావించడం ప్రమాదకరం. ఇప్పటి విద్యా వ్యవస్థలో విద్యార్థులపై తీవ్రమైన పోటీ, ఒత్తిడి పెరుగుతోంది. చిన్న వయస్సు నుంచే పిల్లలపై 'మొదటి ర్యాంకు రావాలి', 'అత్యధిక మార్కులు సాధించాలి' అనే ఆంక్షలు పెడుతున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కూడా మార్కుల ఆధారంగా విద్యార్థులను అంచనా వేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో కొంతమంది విద్యార్థులు తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి తీవ్ర ఒత్తిడిని అనుభవిస్తున్నారు. కొన్నిసార్లు ఈ ఒత్తిడి వారి మానసిక ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తోంది.



ప్రతిభ అనేది కేవలం పుస్తకాలలోని విషయాలను కంఠస్థం చేసుకోవడంలోనే ఉండదు. ప్రతి విద్యార్థికి వేర్వేరు ప్రతిభలు, ఆసక్తులు ఉంటాయి. కొందరు విజ్ఞానశాస్త్రంలో నైపుణ్యం చూపిస్తే, మరికొందరు కళల్లో, క్రీడల్లో, లేదా సృజనాత్మక రంగాల్లో ప్రతిభ కనబరుస్తారు. అయితే, మార్కుల ఆధారంగా మాత్రమే విద్యార్థులను కొలిచే విధానం ఈ విభిన్న ప్రతిభలను గుర్తించకుండా చేస్తోంది. దీనివల్ల చాలా మంది విద్యార్థులు తమ నిజమైన సామర్థ్యాన్ని చూపించడానికి అవకాశాలు కోల్పోతున్నారు. మరొక ముఖ్యమైన విషయం ఏమిటంటే, జీవితంలో విజయానికి మార్కులే ఒకే మార్గం కావు. చరిత్రను పరిశీలిస్తే, అనేక మంది విజయవంతులైన వ్యక్తులు విద్యార్థి దశలో అత్యధిక మార్కులు సాధించకపోయినా, తమ ప్రతిభ, పట్టుదల, సృజనాత్మకత ద్వారా గొప్ప విజయాలను సాధించారు. జీవితంలో నిజమైన విజయానికి అవసరమైన లక్షణాలు ఆత్మవిశ్వాసం, కష్టపడే తత్వం, సమస్యలను ఎదుర్కొనే ధైర్యం, సృజనాత్మక ఆలోచన ఇవి పరీక్షల మార్కులతో మాత్రమే కొలవలేం. ఇంకా ఒక ముఖ్యమైన అంశం.. విద్యార్థుల మానసిక భావోద్వేగ ఆరోగ్యం. ఒక విద్యార్థి జీవితంలో ఆనందం, ఆత్మగౌరవం, సంతోషం కూడా చాలా ముఖ్యమైనవి. కానీ మార్కులపై అధికంగా దృష్టి పెట్టడం వల్ల కొంతమంది విద్యార్థులు విఫలమయ్యామనే భావనతో నిరాశకు గురవుతున్నారు. కొన్నిసార్లు ఈ నిరాశ తీవ్రమై ప్రమాదకర పరిస్థితులకు దారితీస్తుంది. అందువల్ల విద్యా వ్యవస్థలో సమతుల్యత అవసరం.

అందుకే తల్లిదండ్రులు ఉపాధ్యాయులు విద్యార్థులపై మార్కుల ఒత్తిడి పెంచడం కన్నా, వారి ఆసక్తులు ప్రతిభలను ప్రోత్సహించాలి. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కళలు, ఇతర సృజనాత్మక కార్యకలాపాల్లో కూడా పాల్గొనేలా ప్రోత్సహించాలి. ఇలా చేయడం వల్ల వారు సమగ్ర వ్యక్తిత్వాన్ని అభివృద్ధి చేసుకుంటారు.

అలాగే విద్యార్థులు కూడా ఒక విషయం గుర్తుంచుకోవాలి.. పరీక్షలో వచ్చిన ఒక ఫలితం జీవితాన్ని నిర్ణయించదు. విజయం అపజయం జీవితంలో భాగమే. అపజయం నుంచి నేర్చుకుని ముందుకు సాగడం నిజమైన విజయానికి దారి చూపుతుంది. మొత్తంగా చూస్తే, మార్కులు జీవితంలో ఒక భాగం మాత్రమే; కానీ జీవితం మార్కుల కంటే ఎంతో పెద్దది. విద్యార్థుల జీవితంలో ఆరోగ్యం, ఆనందం, వ్యక్తిత్వ వికాసం, మానవ విలువలు కూడా సమానంగా ముఖ్యమైనవి.

కాబట్టి మన విద్యా వ్యవస్థ, తల్లిదండ్రులు, సమాజం కలిసి "మార్కుల కోసం మాత్రమే చదువు" అనే భావన నుంచి బయటపడాలి. విద్యార్థులు మంచి మార్కులు సాధించడం మంచిదే; కానీ వారి జీవితం, వారి కలలు, వారి సంతోషం అంతకంటే విలువైనవి.

అంతిమంగా చెప్పాలంటే మార్కులు అవసరం, కానీ జీవితం మరింత ముఖ్యమైనది. విద్య మనిషిని కేవలం పరీక్షల్లో విజయవంతుడిగా కాకుండా, జీవితంలో సమర్థుడిగా, సంతోషంగా, బాధ్యతగల వ్యక్తిగా తీర్చిదిద్దాలి.

– తిప్పర్తి శ్రీనివాస్

## ఈ వారం కవిత్వం

# చంద్రవంక



ఆకాశంలో వెలుగు వంక
అది జాబిల్లి మేను వంక
అందాలొలికే చంద్రవంక
ఆకాశ సౌధానికి సౌందర్య వంక!
మొగులులో దాగి వస్తాడు ఆనక
మెల్ల మెల్లగా వాని నడక
చంద్రకళలు అని వాడుక
తిరుగుతాడు తారల వెనుక!
వాడు నవ్వితే
పున్నమే ఇంక
వాడు అలిగితే
అమావాస్య ఇక
వాని పదిహేను
అడుగుల నడక
వార తిథి నక్షత్రాల
వేడుక!
అందాల వెండి వెన్నెల చంద్రవంక
ముద్దు ముచ్చట్ల వెలుగు వంక
చూస్తున్నది నేల వంక
నెలనెలకు మొలిచే నెలవంక!
ఏ కొమ్మ కోసమో ఈ వంక
వంగింది కొమ్మ నేల వంక
ఉండలేను చూడకుండా ఆ వంక
జలతారు తేరు వస్తున్నది నా వంక!

– పట్టోళ్ళ బక్కారెడ్డి

# అంతరంగపు చీకటి

మాటలు ఆగిపోయిన క్షణంలో
హృదయపు భాష మొదలవుతుంది
ఆ భాషకు అక్షరాలు ఉండవు,
కానీ
ఆర్తి మాత్రం స్పష్టంగా వినిపిస్తుంది.
జ్ఞాపకాల గర్భంలో
కొన్ని క్షణాలు కదలకుండా
నిలిచిపోతాయి
కాలం ముందుకు నడిచినా
అవి మనసును మాత్రం
విడిచిపెట్టవు.
బయటకు కనిపించేది
ఒక చిరునవ్వే...
అయితే..!
అది చాలా సార్లు
బాధను దాచుకునే ఒక తెర
మాత్రమే.
లోపల ఎక్కడో
నిశ్శబ్ద రోదన తాలూకు
ఒక గాయం ఉంటుంది..
కనిపించదు.
జీవితపు ప్రతి స్పర్శకు
స్పందిస్తూ ఉంటుంది.
మనిషి హృదయం
ఒక మూసివేసిన పుస్తకం
కొన్ని పేజీలు మాత్రమే ప్రపంచానికి.
మిగతావి అంతరంగపు
చీకటిలోనే మిగిలిపోతాయి.
అందుకే కొన్ని అనుభూతులు
మాటలతో కాదు
మౌనంతో వినగలిగినప్పుడే
అర్థమవుతాయి.

– డా॥ మామిడాల శైలజ

# తాళంచెవి

'ఇల్లు' కన్న తలుపు
చిన్నది
'తలుపు' కన్న తాళం
చిన్నది
'తాళం' కన్న 'తాళంచెవి' చిన్నది
ఇంటి కంట్రోల్ చిన్న 'కీ'లో ఉన్నది
మన సుదీర్ఘ జీవితాన్ని
నిర్ణయించేది..
చిన్న చిన్న తెలివైన కార్యాలే సుమా!
చెట్టు కన్న కొమ్మలు చిన్నవి
కొమ్మల కన్న ఆకులు చిన్నవి
ఆకుల కన్న
గింజలు
చిన్నవి.
బతకడం కన్న
జీవించడం
గొప్పది
తీసుకోవడం
కన్న ఇవ్వడం
గొప్పది
గింజ పగిలి
చెట్టై
ఎదగడమే
గొప్పది!
స్నేహితులు నానా
రకాలు..
ప్రతి ఏటా రాలిపోయే
'ఆకులు'
గాలి వాటానికి విరిగే 'కొమ్మలు'
కంటికి కనబడని లోతైన 'వేర్లు'
చెట్టు ఉనికికి కారణమైన 'గింజలు'
గింజల్లాంటి వాళ్లే కదా
ప్రాణ మిత్రులు!
'అనుమానం' ఆనందాన్ని హరిస్తుంది
'దురాశ' దుఃఖ హేతువు
అవుతుంది.
'నేను' అనే గర్వం
ఏకాకిని చేస్తుంది
'షరతుల'తో జీవితం
ఓటమిని ఇస్తుంది.
'ఈర్ష్య అసూయ'
దేహాన్ని చెదలై
తింటుంది.
'నిష్కల్మష' హృదయం
ప్రశాంతత తెస్తుంది !



– మధుపాళీ



# వెన్నెల వెలుగు..

చీకటిని తరిమేసి
వెలుగులో బతకాలి
అజ్ఞానాన్ని అంతం చేసి
జ్ఞానసంపద పెంచుకోవాలి
వెలుగు బాటలో నడిచి
తెలిసిన గమ్యం చేరగలం.
అవసరంలేని అనుమానాలు
పక్కనపెట్టి పయనిస్తే
బయటా లోపలా వెలుగే !!
విజయం పున్నమివెన్నెల.

– శాంతమూర్తి

# మహిళల శబరిమల అట్టుక్కల్ భగవతి క్షేత్రం



ఏటా ఒకసారి మహిళలే పొంగలి సమర్పించే దేవాలయం అట్టుక్కల్ భగవతి క్షేత్రం. ఈ క్షేత్రం కేరళ రాజధాని తిరువనంతపురంలో ఉంది. ఏటా ఫిబ్రవరి/మార్చి నెలలో ఆటుకాల్ భగవతికి తొమ్మిది రోజులు పూజ నిర్వహించి భగవతికి పొంగలి సమర్పిస్తారు. కేరళం రాష్ట్రం నుండి, అలాగే దేశ విదేశాలలో ఉండే మలయాళీ స్త్రీలు లక్షలలో భగవతికి పొంగలి సమర్పించడానికి వస్తారు. ఆ రోజు కేరళం రాష్ట్ర రాజధాని స్త్రీలతో నిండిపోతుంది. తిరువనంతపురం వీధుల్లో పొంగలి సమర్పించడానికి పొయ్యి, వంట దినుసులు మొ॥ కోసం వంటచెరకు సిద్ధం చేసుకుంటారు. లక్షలాది మంది స్త్రీలు ఒక చోట చేసి, దేవికి



ప్రసాదం వండడం, గిన్నెస్ బుక్ రికార్డు ప్రతీ సంవత్సరం ఆ రికార్డు తిరగరాయడం భగవతి శక్తి అని చెప్పవచ్చు. ప్రపంచంలో ఒక నగరమే వంటశాలగా మారడం లేదు. దీనిని స్త్రీల శబరిమల అని అంటారు. ఈ కార్యక్రమంలో స్త్రీలు మాత్రమే పాల్గొనాలి. స్త్రీలు కుటుంబాభివృద్ధి, ఐశ్వర్యం కోసం ఆటుకాల్ భగవతికి పొంగాల సమర్పించుకుంటారు. పొంగాల స్త్రీలు నగరం వీధుల్లో, రోడ్ మీద, ఇంటి అరుగు మీదా చేసుకుంటారు.

లక్షల మంది స్త్రీలు ఒక చోట చేరిన సందర్భంలోనూ ఎలాంటి ఇబ్బందులు వారికి కలగకుండా ఏర్పాట్లు జరగడం విశేషంగా చెప్పవచ్చు. మరి ఇంత పెద్ద కార్యక్రమానికి ప్రభుత్వ సహకారం అంతకు మించి ప్రజల సహాయం చాలా అవసరం. ఈ కార్యక్రమంలో పాల్గొనేవాళ్లందరినీ భగవతి స్వరూపంగా భావిస్తారు.

స్త్రీలు కొత్త వస్త్రాలు ధరించి, కొత్త మట్టికుండ, కర్రలు మూడు ఇటుకలు, పాలు, బియ్యం, బెల్లం వంటివి తెచ్చుకుంటారు. తాము కూర్చునే చిన్న స్థలాన్ని మంచి నీటితో శుభ్రం చేసుకుంటారు. అంతకు ముందే పారిశుద్ధ్య కార్మికులు నగర వీధులు అంతటా నీటితో శుభ్రం చేస్తారు. ముహూర్త సమయానికి చిరు జల్లులు పడి ఆ ప్రదేశం అంతా పవిత్రంగా మారడం గొప్ప విశేషంగా చెప్పుకోవచ్చు.

ఇటుకలు పేర్చి కొత్త మట్టికుండలో పాలు, బెల్లం బియ్యం పోసి సిద్ధంగా ఉంచుకుంటారు. ఆటుకాల్ భగవతి ముందు పూజారి పొయ్యి వెలిగించి పొంగాల వంటకం ప్రారంభిస్తారు. ఆ పొయ్య నుండి దీపాన్ని వెలిగించి పూజారులు నాలుగు వైపులా తిరుగుతూ తీర్థం జల్లుతారు. స్త్రీలు సిద్ధం చేసిన పొయ్యిలో తాము తెచ్చిన దీపం ద్వారా అగ్ని వెలిగిస్తారు. స్త్రీలు వారి వెంట వచ్చినవారు ఎంతో భక్తిశ్రద్ధలతో భగవతిని ప్రార్థిస్తారు. భగవతికి సమర్పించిన పొంగలి ఎంతగా పొంగి పొయ్యిలోకి పొర్లుతోందో అంతగా తమ జీవితాలలో ఐశ్వర్యం కలుగుతుందని నమ్మకం.

కేరళ రాజధాని తిరువనంతపురం నగరంలో కిలియార్ నది ప్రవహిస్తోంది. దాని ఒడ్డున ఆటుకాల్ భగవతి క్షేత్రం ఉంది. ముల్లవీట్టిల్ అనే వారి ఇంటి పెద్ద కలలో ఒక బాలిక కలలో కనిపించి తనని ఆవలి ఒడ్డుకి చేర్చమని అడుగుతుంది. హోరున కురుస్తున్న వాన మరింత ఉధృతంగా ప్రవహిస్తున్న నది, పైగా వయోభారం. ఇవేవి లెక్క చేయకుండా ఆయన నది ఆవలి ఒడ్డుకు చేరి ఆ బాలికను ఇవతలి ఒడ్డుకు చేర్చాడు.

ఆ బాలికను తన ఇంటికి తీసుకువెళదామని అనుకునే లోపు అదృశ్యమైపోతుంది. అది చూసి ఎంతో బాధపడ్డ అతనికి తనకి దేవాలయం ప్రతిష్ఠించమని చెప్పింది. పరమ సాత్వికురాలు కణ్ణగి తన మీద వేసిన అభాండం వేసిందన్న కోపంతో మధుర పట్టణాన్ని దహించి వేసి కేరళలోని కొడుంగల్లూర్‌కి ప్రయాణం అయింది. ఆమె ఆటుకాల్ వచ్చి దేవి రూపంలో వెలిసిందని అంటారు. సాధారణంగా దేవి శాంత స్వరూపిగా ఉంటుంది. పొంగాల సమయంలో అమ్మవారు ఉగ్ర రూపిణిగా ఉంటారు. కానీ స్త్రీలు సమర్పించిన పొంగలి చూసి భగవతి శాంత స్వరూపిగా మారి తన భక్తులను కటాక్షిస్తుందని భక్తుల విశ్వాసం.

– ఈఎస్ మాధవన్

కథ

# కల నిజమయ్యేదెలా?

నాలుగవ తరగతిలో పిల్లలందరూ నిర్మలా టీచర్ ఆ రోజు ఏం పాఠం చెప్తుందా అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. "సముద్రాల్లో చాల జీవులు ఉంటాయి కదా! మీకు తెలిసిన కొన్ని పేర్లు చెప్పండి?" ప్రశ్నించింది టీచర్. "చేపలు" చెప్పింది రుషిత. "సముద్ర పాములు, జెల్లీ ఫిష్" చెప్పాడు యువన్. "వెరీగుడ్. మీలో ఎంతమంది ముత్యాలు, పగడాలు చూసారు?" ప్రశ్నించింది టీచర్. చాల మంది పిల్లలు చేతులు పైకెత్తారు."టీచర్, మా అమ్మకి ముత్యాల దండ ఉంది" కళ్ళు పెద్దవి చేస్తూ చెప్పింది కాథరీన్.

"టీచర్, మా నాన్న చేతివేలికి పగడపు ఉంగరం ఉంది" దర్జాగా లేచి చెప్పాడు భావేష్. "మరి ఆ ముత్యాలు, పగడాలు ఎక్కడ దొరుకుతాయో మీకు తెలుసా?" అందరిని చూస్తూ ప్రశ్నించింది టీచర్. "గోల్డ్ షాప్‌లో టీచర్" అన్నాడు కైలాష్. నిర్మలా టీచర్ నవ్వుతూ "నువ్వు చెప్పింది నిజమే కైలాష్. కానీ ఆ గోల్డ్ షాప్ వాళ్ళకి ముత్యాలు, పగడాలు ఎక్కడ నుంచి వస్తాయో తెలుసా మీకు?" మళ్ళీ ప్రశ్నించింది. పిల్లలందరూ తల అడ్డంగా ఊపారు తెలియదంటూ . "నేను చెప్తనా..అవి కూడా మంచినీటి నదులు, సముద్రాల్లో నివసించే కొన్ని రకాల జీవుల నుంచి తయారవుతాయి" అంది. "అవును, పెరల్ ఆయిస్టర్ అనే ముత్యపు చిప్పజీవుల నుంచి ముత్యాలు, కోరల్ పాలిప్ అనే జీవుల నుంచి పగడాలు లభిస్తాయి. ఈ పగడపు జీవులు సముద్రాల్లో పెద్ద పెద్ద ఎర్రటి దీవులుగా ఏర్పడతాయి. ముత్యాలు, పగడాలను ఆ జీవులు ఎలా తయారు చేస్తాయి అనే విషయాలు మీరు పెద్ద తరగతికి వెళ్ళాక నేర్చుకుంటారు" అంది టీచర్.



పిల్లలందరూ కొత్త విషయం తెలుసుకున్న ఉత్సాహంతో ఇంటికి వెళ్ళారు. ఇంటికి వెళ్ళినా కైలాష్‌కి టీచర్ చెప్పిన పాఠమే గుర్తుకు వస్తోంది. ఆ రోజు టీచర్ చెప్పిందంతా వాళ్ళ అమ్మకి మురిపెంగా చెప్పాడు. రాత్రి భోజనం తర్వాత పాఠం గురించే ఆలోచిస్తూ పడుకున్నాడు. కలలో తాను వెట్ సూట్ వేసుకుని సముద్రపు లోతుకు ఈదుకుంటూ వెళ్ళి, అక్కడ జీవులను చూసినట్లు కల కన్నాడు.

స్కూలుకి వెళ్లిన తరువాత నిర్మాలా టీచర్‌కు తన కల గురించి చెప్పాడు. తాను చెప్పిన పాఠంలోని విషయాలు కల్లోకి వచ్చేంతలా ఆలోచించిన కైలాష్‌ని మెచ్చుకుంది.

"అయితే.. టీచర్" అన్నాడు కైలాష్.

"చెప్పు కైలాష్..ఏంటి నీ డౌట్?" అంది టీచర్. "మరి నాకు వచ్చిన కల నిజమవుతుందా? నేను సముద్రం లోతుకు వెళ్ళగలనా?" టీచర్ ఏం చెప్తుందా?" అని ఆతృతగా చూసాడు కైలాష్.

"మంచి సందేహం అడిగావు కైలాష్. ఒక్క కైలాష్‌నే కాదు. పిల్లలూ మీరందరూ కూడా వినండి. అందరూ మంచి మంచి కలలు కనాలి. అవి నిజం కావాలంటే మీరందరూ బాగా చదువుకోవాలి. బాగా చదివి జ్ఞానాన్ని సంపాదిస్తే, పెరిగి పెద్దయ్యాక, మీరు కన్న కలలన్నింటినీ నిజం చేసుకోవచ్చు. ఈ మాట మన మాజీ రాష్ట్రపతి, గ్రేట్ సైంటిస్ట్ అబ్దుల్ కలాం అన్నారు. మరి మీరందరూ మీ కలలు నిజమవడానికి బాగా చదువుకుంటారుగా" అంది టీచర్ పిల్లలందరి వైపు చూస్తూ.

"బాగా చదువుకుంటాము టీచర్" పిల్లలందరూ ముక్తకంఠంతో టీచర్‌కి బదులిచ్చారు కైలాష్‌తో సహా.

– రోహిణి వంజారి



వార్త ఆదివారం



## బాలగేయాలు

### చిలుకమ్మ చెలిమి

చిట్టి చిలుకమ్మ ఒకటి నాతో
స్నేహం చేస్తానంది చక్కని
కబుర్లు చెబుతూ తనతోనే
ఉండమని చెప్పింది. తనతో
చెలిమి చేయమని అడిగింది
స్నేహం మేము చేయగా తీయని
పండ్లు ఇచ్చింది
కమ్మని కబుర్లెన్నో చెప్పింది
ఎంతో సంతోషం పంచింది!

– డాక్టర్ నెమిలేటి

### కుటుంబం

అమ్మ ప్రేమ మధురము
అయ్యలాలన హితము
అక్కతోనే స్నేహము
అన్నతోనే నడుస్తాం
అత్త మాట మకరందము
మామతోనే ఆడుదాం
అమ్మమ్మ చేత చల్లదనం
తాతయ్యతోనే తిరుగుదాం
బాబాయితోనే నవ్వుదాం
నానమ్మతో కథలు విందాం
తాతయ్య ముందు చదువుదాం
కుటుంబమే నా ప్రపంచం

– పెండోట వెంకటేశ్వర్లు

**చిన్నారుల ప్రశ్నలకు**

**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**

**గిరీష్ అంకుల్ సమాధానాలు**

సి.అమర్నాథ్,
యాగంటి

ప్రశ్న: విమాన ప్రొపెల్లర్‌లు ఎలా పనిచేస్తాయి?

జవాబు: విమానం గాలిలో ముందుకు దూసుకుపోవడానికి ప్రొపెల్లర్‌లు సహకరిస్తాయి. అంటే ఈ ప్రొపెల్లర్‌లకు ఉండే బ్లేడ్‌లు ఎదురుగా వస్తున్న గాలిని చీల్చుకుంటూ ఎంతో శక్తిమంతమైన వేగంతో దానిని వెనక్కి నెట్టివేస్తాయి. అప్పుడు ఆ గాలి ప్రొపెల్లర్స్‌ను ముందువైపుకి నెడుతుంది. న్యూటన్ గతిసూత్రం యాక్షన్ అండ్ రియాక్షన్(చర్య-ప్రతిచర్య) సిద్ధాంతం ప్రకారం విమానం ముందు వైపుకు చూసుకుని వెళుతుంది. ప్రతి ఒక్క చర్యకు సమాన ప్రతిపత్తిలో ప్రతిచర్య అనేది ఉంటుందన్న సిద్ధాంతరీత్యా ఈ రెండు చర్యలూ వ్యతిరేకంగా కూడా ఉంటాయి.

ఎస్.అన్వేషిత, హైదరాబాద్

ప్రశ్న: సహజమైన ముత్యాలు ఎలా ఏర్పడతాయి?



జవాబు: నత్తలు లేదా ఇతర మొలస్కన్ ఈజవుల్లో లోపలి అవయవాలను కప్పివుంచేందుకు ఓ పొర ఉంటుంది. దీన్నే మాంటెల్ అంటారు. ఈ మాంటెల్ నుండి ఓ ప్రత్యేకమైన ద్రవం బయటకు స్రవిస్తుంటుంది. ఈ ద్రవాన్ని నాక్రే అంటారు. ఏదైనా ఫారెన్ బాడీగానీ, లేదా చిన్న పర్జాజీవిగానీ, నత్త లేదా మొలస్కన్స్‌కు తగిలినప్పుడు నాక్రే అనే ద్రవపదార్థం గుండ్రటి పలుచని పొరలు పొరలుగా ఏర్పడుతుంది. ఇలా ఒకదాని మీద ఒకటి అనేక పొరలు ఏర్పడటంతో అది ముత్యంగా రూపొందుతుంది.



# ‘సోలో డేటింగ్’ అంటే?



ప్రపంచం ప్రతీ క్షణం పరుగులు తీస్తోంది. కానీ మనసు మాత్రం ఆ పరుగుల వెనుక తడబడుతోంది. గడియారం మోగే ప్రతి శబ్దం మనలోని నిశ్శబ్దాన్ని చెరిపేస్తోంది. మనుషుల మధ్య మనిషి కనిపించడం తగ్గిపోయింది; మనసుల మధ్య దూరం పెరిగింది. ఈ వేగంలో మనం ఏదో వెతుకుతున్నాం కానీ అది బయట కాదు, మనలోనే ఉంది.

ఒక చినుకు నిశ్శబ్దం మన ఆత్మకు ఆహారమవుతుంది, ఒక క్షణం ఒంటరితనం మనకు కొత్త మనిషిని చూపిస్తుంది. ఆ క్షణంలో మనం మనల్ని తాకుతాం, మనలో దాగి ఉన్న ప్రశాంతతను తడుముకుంటాం. ఇదే జీవన యాత్రలోని నిజమైన విశ్రాంతి.

ఆత్మను వినగలిగే సమయం దొరకడం అరుదు, దాన్ని ఆస్వాదించడం మరింత అరుదు. కానీ దానిని పొందినవాడు జీవన రహస్యాన్ని తెలుసుకున్నట్టే. మనసు తనతోనే మాట్లాడే ఆ నిశ్శబ్ద క్షణాల్లోనే నిజమైన వెలుగు పుడుతుంది.. అది ఒంటరితనంలో వెలిగే వెలుగు. ఈ ఉపోద్ఘాతం పూర్తిగా కొత్తది, కవితాత్మక గంభీరతతో రాసినది, మీ వ్యాసం భావరేఖను ముందుగానే సున్నితంగా పరిచయం చేస్తుంది.

## ఒంటరితనంలో వెలిగే వెలుగు

మనిషి తన జీవితంలో అందరికీ సమయం ఇస్తూనే ఉంటాడు. కానీ తనకోసం కొంత సమయం కేటాయించడం ఎప్పుడూ మరిచిపోతాడు. మనం ఒంటరిగా ఉండటం అంటే సమాజం చెప్పినట్లుగా బాధ కాదు, అది మనలోని మనిషిని చూసే ఒక అవకాశం. ఈ రోజుల్లో ‘సోలో డేటింగ్’ అనే పదం వినిపిస్తోంది.

కానీ దానిలోని సత్యం అంతరంగానికి దగ్గరగా ఉంది. అది తాత్కాలిక ఫ్యాషన్ కాదు, మనసు మేల్కొలిపే ఒక మనోభావం. ప్రతీ ఉదయం మిర్రర్ ముందు నిలబడి మనం మనకే చిరునవ్వు ఇస్తే, ఆ క్షణంలో మన మనసు మనతోనే మాట్లాడుతుంది. బయట ప్రపంచం మనలను కొలుస్తూనే ఉంటుంది మార్కులతో, ఫాలోవర్లతో రూపంతో. కానీ మనం మనల్ని ఎంతగా అర్థం చేసుకున్నామన్నదే అసలు జీవన ప్రమాణం. ఈ ఆత్మాన్వేషణే ఇప్పుడు కొత్త తరంలో ‘సోలో డేటింగ్’గా పిలవబడుతోంది.

ఒంటరిగా ఒక కాఫీ తాగుతూ జీవితాన్ని తలచుకోవడం, లేదా సముద్ర తీరంలో నడుస్తూ మనసుని మనమే వినటం. ఇవన్నీ ఇప్పుడు జీవనశైలిలో భాగమవుతున్నాయి. ఈ తరహా సైలెన్స్ మనలోని కలవరాన్ని తగ్గించి, మన మనసులోని మాటను వినిపిస్తుంది.

సెల్ఫ్ కేర్, సెల్ఫ్ లవ్ అనే పదాలు ఇప్పుడు ప్రాచుర్యంలో ఉన్నాయి. కానీ అవి కేవలం భావాలే కాదు; అవి జీవన సూత్రాలు. మనసు దెబ్బతిన్నప్పుడు, ఆత్మ నొచ్చినప్పుడు, తిరిగి నిలబడే శక్తి మనలోనే ఉందని గుర్తు చేసే మార్గం ఇదే. మన మనసుకు విశ్రాంతి ఇవ్వడం కూడా ఒక కళే. మనిషి తనతో మాట్లాడటం మొదలు పెడితేనే నిజమైన సంభాషణ మొదలవుతుంది. బాహ్య ప్రపంచం ఇచ్చే శబ్దం నిశ్శబ్దమైన అంతరంగాన్ని మూయిస్తుంది. సోలో డేటింగ్ ఆ నిశ్శబ్దాన్ని తిరిగి తెరుస్తుంది. మనం ఎవరో, మన జీవితానికి విలువ ఏమిటో అర్థం చేసుకునే క్షణాల సమాహారం ఇది. జీవితం ఎప్పుడూ ఇతరుల సమీక్షకై కాదు; మన ఆత్మ సంతృప్తికై. ఈ సత్యం గ్రహించినప్పుడే మన జీవితం నెమ్మదిగా, శాంతంగా, అర్థవంతంగా మారుతుంది. మనలోని వెలుగును వెలిగించేది బాహ్య ప్రపంచం కాదు; మనమే. అందుకే ఒంటరితనంలో వెలిగే వెలుగును ఆప్యాయంగా ఆస్వాదించండి. అదే నిజమైన జీవితం.

ప్రపంచంలో ప్రతి దేశం తన సంస్కృతిని, జీవన విధానాన్ని వేర్వేరు రీతుల్లో మలుచుకుంది. కానీ గత కొన్నేళ్లుగా అందరినీ ఒకే భావన కలిపింది అది ‘మనతోనే గడిపే సమయం’. దీనిని పాశ్చాత్య దేశాలలో ‘సోలో డేటింగ్’ అని పిలుస్తారు. కానీ దాని వెనుక ఉన్న అర్థం చాలా లోతైనది. మనసుతో మనం మాట్లాడుకునే నిశ్శబ్దం. ఈ ఆలోచన మొదటగా అమెరికా, జపాన్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో వేగంగా విస్తరించింది. అక్కడి యువత ఆఫీసు ఒత్తిడులు, నగర జీవన గందరగోళం, ఒంటరితనం వల్ల తాము తాము కోల్పోతున్నారని గ్రహించారు. అందుకే వారిలో చాలా మంది వారాంతాల్లో ఒంటరిగా రెస్టారెంట్కి వెళ్లి భోజనం చేయడం, సైలెంట్ పార్కుల్లో నడవడం, లేదా సినిమా చూడడం మొదలుపెట్టారు. అక్కడ ఈ భావన ఒక కొత్త స్వీయ సంస్కృతిగా రూపాంతరం చెందింది. జపాన్లో దీనిని ‘ఒహితోరి సమయం’ (ఒంటరిగా గడిపే సమయం) అని పిలుస్తారు.అక్కడి ప్రజలు దీనిని సిగ్గుగా కాకుండా ఆత్మబలం పొందే పద్ధతిగా చూస్తారు.

అదేవిధంగా యూరప్ దేశాలలో, ముఖ్యంగా ఫ్రాన్స్, ఇటలీలో, ఈ ధోరణి 'ఆత్మానుభూతి విరామం'గా స్వీకరించబడింది. ఒక్క కాఫీతో గంటల కొద్దీ తమ ఆలోచనలతో గడిపే సంస్కృతి అక్కడ సహజం అయింది. దక్షిణ కొరియాలో అయితే అలోన్ లైఫ్ అనే ఉద్యమం వెలిసింది. దానిలో మనిషి తనను తాను గౌరవించుకోవడం, తన ఇష్టాలకు విలువ ఇవ్వడం ప్రధానంగా నిలిచాయి. ఇప్పుడు ఈ ప్రభావం మన దేశానికీ చేరింది. నగర జీవన శైలిలో ఒత్తిడి, మానసిక దడ, సంబంధాల అర్థహీనత.. ఇవన్నీ మనసును తన నుంచే దూరం చేశాయి. అందుకే కొత్త తరం యువత ఇప్పుడు 'స్వీయ సమయం' అనే భావనను స్వీకరిస్తోంది. హైదరాబాద్, బెంగళూరు, ముంబయి, పుణే వంటి నగరాల్లో వారాంతాల్లో ఒంటరిగా కేఫేలకు, బీచ్‌లకు, పార్కులకు వెళ్లే యువతను తరచుగా చూస్తున్నాం. వారు దీనిని ఒక మైండ్ డీటాక్స్‌గా భావిస్తున్నారు. అంటే మనసు శుభ్రం చేసుకునే సమయం.



మన దేశంలో ఇది ఇంకా కొత్తదే అయినా, ఆలోచనగా ఇది ప్రాచీనమైనది. మన సంస్కృతిలో తపస్సు, ధ్యానం, ఏకాంతం వంటి భావాలు యుగాల క్రితమే ఉన్నవి. రాముడు వనవాసంలో గడిపిన నిశ్శబ్దం, బుద్ధుడు బోధి వృక్షం కింద పొందిన జ్ఞానం, శంకరాచార్యుడి ఆత్మసాక్షాత్కారం ఇవన్నీ స్వీయ సంభాషణకు ప్రతీకలు. తేడా ఒక్కటే. అప్పట్లో ఇది ఆధ్యాత్మిక మార్గంగా ఉండేది; ఇప్పుడు అది మానసిక శాంతి సాధనగా మారింది.

మన దేశంలో యువత ఈ ఆలోచనను సానుకూలంగా స్వీకరిస్తోంది. పుస్తక పఠనం, సంగీతం, ప్రయాణం, ధ్యానం.. ఇవన్నీ స్వీయ సఖ్యతగా మారుతున్నాయి. వీటివల్ల మానసిక ఆరోగ్యం మెరుగవుతోంది, వ్యక్తిత్వం స్పష్టమవుతోంది, నిర్ణయశక్తి బలపడుతోంది. ఈ ధోరణి కొనసాగితే భవిష్యత్తులో మన దేశం భావోద్వేగ పరంగా మరింత స్థిరమైన సమాజంగా మారే అవకాశం ఉంది. మనతో గడిపే సమయం మనం కోల్పోయిన మనల్ని తిరిగి కనుగొనే దారిగా మారుతోంది.

ప్రపంచం ఎంత వేగంగా పరుగులు తీసినా, మనసు ఒక చిన్న విరామం కోరుకుంటుంది. ఆ విరామంలోనే మన ఆత్మ మాట్లాడుతుంది, మనలోని వెలుగు పుడుతుంది. ఇదే మన కాలం చెప్పే కొత్త సత్యం ఒంటరితనం ఒక పండుగ

## మనలోని నిశ్శబ్ద దీపం

ఒంటరితనం అనేది చాలా మందికి భయానకంగా కనిపించవచ్చు, కానీ లోతుగా ఆలోచించినప్పుడు అది మనలోని మానవత్వాన్ని వెలిగించే దీపమని అర్థమవుతుంది. మనం మనసుతో మాట్లాడటం మొదలు పెట్టినపుడు ప్రపంచం ఇచ్చిన ప్రతీ శబ్దం అర్థరహిత మవుతుంది. బయటకు కనిపించని ఆ నిశ్శబ్దం మన ఆత్మలో ఒక కొత్త సంగీతాన్ని సృష్టిస్తుంది. అదే మనను బలవంతుడిగా, దయగలవాడిగా, అంతరంగంగా మార్చే సాధన. ప్రతి మనిషిలో ఒక చిన్న కవిత దాగి ఉంటుంది. అది మనం ఒంటరిగా ఉన్నప్పుడు మాత్రమే బయటకు వస్తుంది. ఆ క్షణాలు మనసుకు ప్రతిబింబాలుగా నిలుస్తాయి. ప్రపంచం మర్చిపోయే మనసుని, మనమే ఆప్యాయంగా ఆలింగనం చేసుకునే సమయం అది. ఆ ఒంటరితనం మనలోని మానవతా స్ఫూర్తిని మేల్కొలుపుతుంది. అదే సృజనాత్మకతకు మూలం.

ఈ రోజుల్లో మనిషి మిగిలింది శబ్దాలతోనే. చుట్టూ స్క్రీన్లు, సందేశాలు, లైకులు, శబ్దాల దద్దరిల్లుతున్నాయి. కానీ మనలోని మృదువైన మాట వినిపించడంలేదు. ఆ మాటను వినిపించేది ఈ స్వీయ సమయం. అది మనసును కడిగి, మన జీవితం ఎంత చిన్నదైనా, ఎంత విలువైనదో గుర్తు చేస్తుంది. ఒంటరితనం మనలోని ఆత్మకు అద్దం లాంటిది. దానిలో చూసే ప్రతిబింబమే మన నిజమైన రూపం.

నిశ్శబ్దంలో గడిపిన ఆ నిమిషాలు జీవితంలో శతాబ్దాల అనుభవం ఇస్తాయి. మనసు తన భయాల నుంచి బయటపడుతుంది, ఆత్మ తన అసలైన రూపాన్ని గుర్తిస్తుంది. ప్రపంచపు అల్లకల్లోలంలో ఈ ప్రశాంతతే మనకు పునర్జన్మ. మనలోని స్వరం, మన కళ్లలోని వెలుగు, మన ఆలోచనల్లోని స్పష్టత.. ఇవన్నీ ఆ నిశ్శబ్దం నుంచి పుడతాయి. జీవితం అనేది మనకు సమయం ఇచ్చిన ఒక బహుమతి. కానీ ఆ సమయాన్ని మనం ఇతరులకే ఖర్చు చేస్తూ, మన మనసు కోసమే వెచ్చించడాన్ని మరిచిపోతున్నాం.'సోలో డేటింగ్' అనే భావన మరిచపోయిన కోణాన్ని మనకు గుర్తు చేస్తుంది. మనం మనతోనే ఉన్నప్పుడు మన జీవితం సంపూర్ణమవు తుంది. అది మనల్ని ఒంటరిని కాదు, స్వతంత్రుణ్ణి చేస్తుంది. మనసు ఎప్పుడూ సహవాసం కోసం మాత్రమే కాదు, స్వీయ సంభాషణ కోసం కూడా తపిస్తుంది. దానిని మనం వినిపించినప్పుడు జీవితం కొత్త అర్థం పొందుతుంది. ప్రపంచం మనపై వేసిన ముసుగులను తొలగించి, నిజమైన మనల్ని చూపే అద్దం ఈ ఒంటరితనం. ఈ అద్దంలో చూసిన మనమే మన జీవితం కవిత. అందుకే, మనలోని నిశ్శబ్ద దీపాన్ని ఆరనీయకండి. అది వెలిగితే మన ఆత్మ పూస్తుంది, మన జీవితానికి అర్థం పుడుతుంది. ఒంటరితనంలో కనిపించే వెలుగు, మన లోపలి అంధకారాన్ని పారదోలి మనసుకు కొత్త దారిని చూపుతుంది. మనతో మనం గడిపే ఆ సమయం ఒక ప్రయాణం బయటకు కాదు, లోపలికి. ఆ ప్రయాణం చివరలో మనకు ఎదురయ్యేది మన మనసే. అదే మన జీవన తాత్పర్యం. ఆ క్షణంలో మనం వెలుగుగా మారతాం, మనలోని నిశ్శబ్దం మన ఆత్మను ఆలింగనం చేసుకుంటుంది. అదే నిజమైన ఆనందం.

– డా॥ చిటికెన కిరణ్ కుమార్

కథ

# ఆకుపచ్చటి అనుబంధం

చిట్టత్తూరు మునిగోపాల్

ఉదయం ఆరు గంటలు అయింది. ఇంకా పూర్తిగా వెలుగు రాలేదు. వరుసగా వారం రోజుల నుంచి మబ్బులు కమ్ముకోవడమే. అప్పుడప్పుడూ నాలుగు జల్లులు పడడం తప్ప ఒక గట్టి వాన లేదు.

అప్పుడే నిద్రలేచి అప్పటికే తెరచివున్న డోర్ తీసుకుని గుమ్మంలోకి వచ్చి నిలబడ్డాడు రాఘవరావు. ఎడమ చేత్తో నడుము పట్టుకుని, కుడి చేత్తో ముగ్గు దిద్దుతోంది ముంగిట జానకమ్మ. కారిడార్ వెంట అటు ఇటు చూపులు సారించాడు. నిర్మానుష్యంగా ఉంది. ముగ్గులు వేయడం కాదు కదా, మానవమాత్రులన్నలన్నవారు కనిపించలేదు కంటికి. కోపం ముంచుకొచ్చింది.

"జానకీ, నీకెన్నిసార్లు చెప్పాను ఇలా చేయవద్దని. కొంపలు మునిగిపోయేటట్టు తెల్లారకుండానే నిద్రలేచి ఆ ముగ్గులేయడం ఏమిటి? నువ్వు ఇంకా మీ పల్లెటూళ్ళోనే ఉన్న కన్నెపిల్ల అనుకుంటున్నావా? లేస్తే కూర్చోలేవు. కూర్చుంటే లేవలేవు. నీకే ముగ్గులు వేయడం, ఆ తర్వాత నడుము నొప్పితో ఎన్నిసార్లు చికాకు పడుతుందో నాకు తెలుసు. పైగా నీకు కీళ్ల నొప్పులు. తెల్లవారక ముందే లేచి ఈ ముగ్గులు పెట్టడం అవసరమా నీకు?"

"చూడండి, నేను పల్లెటూళ్లో పుట్టి పెరిగాను. ఈ అపార్టుమెంటుకు రావడానికి ముందు కూడా మీ ఉద్యోగం కోసం చిన్న టౌన్‌లో అద్దె ఇంట్లో కాపురం ఉన్నాము. ఎక్కడా ముగ్గులు వేయడం మానలేదు. ముక్కుతూ మూలుగుతూ ఉండడం... ఇవన్నీ నీకవసరమా చెప్పు." నోరు చేసుకున్నాను అనుకున్నాడు. మాట మాత్రం సౌమ్యంగానే గొంతులో నుంచి బయటకు వచ్చింది. ఇంకా ఏదో అనబోతుంటే ఆయాసం తన్నుకుని వచ్చింది. ఆ వెంటనే దగ్గుతో సతమతమైపోయాడు.

"అయ్యో... ఇంత పొద్దున్నే మిమ్మల్ని ఎవరు లేచి బయటకు రమ్మన్నారండీ. మీకసలే ఆయాసం, ఉబ్బసం. చెబితే వినరు" వేస్తున్న ముగ్గు సగంలో ఆపేసి దగ్గరగా వచ్చి రాఘవరావును పొదివి పట్టుకుని ఇంట్లోకి నడిపించింది లక్ష్మి.

"అలా వాకింగ్‌కు వెళ్ళవద్దామనీ..." కుర్చీలో కూర్చుంటూ చెప్పాడు ఆయన, ఆయాసాన్ని అదుపు చేసుకుంటూ.

"అసలే మీ ఆరోగ్యం అంతంతమాత్రం. ఇంత ఉదయం పూట వాకింగ్ వద్దన్నారుగా డాక్టరుగారు. కాస్త పొద్దు ఎక్కాక టిఫిన్ చేసి తర్వాత వెళ్ళవచ్చుగా అంటే వినరు" విసుక్కుంది జానకమ్మ, ఫ్లాస్క్‌లో వేడిచేసి ఉంచిన నీళ్ళు తాగడానికి భర్త చేతికి అందిస్తూ.

"జానకీ, ఇలా వచ్చి నా పక్కన కూర్చో" గ్లాసుతో పాటు భార్య చేతిని పట్టుకుని నెమ్మదిగా లాగాడు రాఘవరావు.

మామూలుగా అయితే ఆయన మాటలు వినేదో లేదో కానీ, ఇంకా కొద్దిగా ఆయాసపడుతుండడం చూసి, మారు మాట్లాడకుండా కూర్చుంది.

"చూడు లక్ష్మీ, మనం ఉండేది అయిదు అంతస్తుల అపార్ట్‌మెంట్‌లోని రెండో అంతస్తులో. అటు నాలుగు, ఇటు నాలుగు వరుసల ఇళ్ళు. మధ్యలో నాలుగు అడుగుల కారిడార్. ఇక్కడ ఎవరైనా ఎప్పుడైనా ఇంటిముందు రెండు ముగ్గు గీతలు పెట్టడం చూశావా నువ్వు? పైగా నువ్వు పెడుతున్న ముగ్గుల వల్ల తమ ముంగిలి పాడైపోతున్నదని ఎదురింటి సాఫ్ట్‌వేర్ అమ్మాయి



కొడుకుతో కలిసి ఇంటికి చుట్టపుచూపుగా ఎప్పుడైనా వచ్చినప్పుడు ముగ్గు వేయడానికి కోడలుపిల్ల ముచ్చటపడినా, వద్దని చెప్పేదాన్ని. ఎందుకంటే ముగ్గు వేయడం నా విషయంలో కష్టం కాదు. తరతరాలుగా మనం కాపాడుకుంటూ వస్తున్న సంస్కృతీ సంప్రదాయాలకు రంగవల్లి ఒక ప్రతీక."

"నువ్వు చెప్పేది నిజమే. కానీ ఏ సంస్కృతి సంప్రదాయాలను పాటించడంలో అయినా స్థలకాలాలలను బట్టి పట్టువిడుపులు ఉండాలి" చెప్పాడు రాఘవరావు.

"ఆ విషయం మీరు నాకు చెబుతున్నారు... ఏదీ ఒకసారి ఆ ముఖం ఇటు తిప్పండి" కొంచెం విసుగుపోతున్నట్టుగా భార్య పెట్టిన ముఖకవళికలు చూసి మాటలు పొడిగించలేకపోయాడు రాఘవరావు.

"ఎలాగూ లేవనే లేచారు. వెళ్ళి దంతధావనం పూర్తి చేసుకుని రండి. నాలుగు మిరియాలు, పుదీనా ఆకులు పాలలో వేసి మరిగించి ఇస్తాను" భర్త నుంచి ఇక సమాధానం రాదని తెలుసు కనుక, చెప్పి కిచెన్లోకి నడిచింది లక్ష్మి.

కొడుకు ఏదో ప్రాజెక్ట్ మీద భార్యాపిల్లలతో ఫారిన్ వెళ్లక ముందు కొన్న ఫ్లాట్ అది. కిచెన్ అంటే వేరుగా ఏమీ లేదు, రెండు పడకగదులు గల ఆ చిన్నపాటి ఫ్లాటులోని హాలులో ఒక పక్క పార్టిషన్ పెట్టిన చిన్నపాటి స్థలమే.

అక్కడ జరుగుతున్న అన్ని పనులూ, మాటలూ హాల్లోని వారికి కనిపిస్తూ, వినిపిస్తూనే ఉంటాయి.

ట్రింగ్... ట్రింగ్... టీవీ కింద టీపాయ్ మీద ఉంచిన మొబైల్ రింగ్ అయింది. లేవలేదు రాఘవరావు. ఆయనకు మొబైల్లో మాట్లాడడం చేతకాదు. అంటే విషయం ఉంటే మాట్లాడుతాడు. కానప్పుడు ఏమి మాట్లాడాలో తెలియక అయోమయానికి లోనవుతాడు. అప్పటికే కాగిన పాలు రెండు గ్లాసుల్లో పోసి కొంచెం చల్లార్చి తీసుకొని వచ్చి ఒక గ్లాసు భర్త చేతికి అందించింది జానకమ్మ.

రెండవ గ్లాసు అలాగే పట్టుకుని వెళ్ళి, మొబైల్ ఆన్ చేసి "హలో భావనా, నువ్వు, అబ్బాయి, పిల్లలు అందరూ బావున్నారా?"మాట్లాడుతూ వచ్చి రాఘవరావు కుర్చీకి పక్కనే ఉన్న సోఫాలో కూర్చుంది.

"అందరం బాగున్నాము అత్తయ్యగారూ. మీరెలా ఉన్నారు? మామయ్యగారి ఆరోగ్యం ఎలా ఉంది? డాక్టర్లు ఏమి చెప్పారు?" అమెరికాలో ఉన్న కోడలు అభిమానంగా అడిగింది.

"నాకేమమ్మా, గుండ్రాయిలా ఉన్నాను. ఎటొచ్చీ మీ మామయ్యగా..." అంటుండగా రాఘవరావు కొంచెం ముందుకు వంగి ఆమె చేతిని మృదువుగా స్పృశించి కళ్ళతోనే వారించారు వద్దన్నట్టు.

> **"ఎలాగూ లేవనే లేచారు. వెళ్ళి దంతధావనం పూర్తి చేసుకుని రండి. నాలుగు మిరియాలు, పుదీనా ఆకులు పాలలో వేసి మరిగించి ఇస్తాను" భర్త నుంచి ఇక సమాధానం రాదని తెలుసు కనుక, చెప్పి కిచెన్లోకి నడిచింది లక్ష్మి.**

"అత్తయ్యగారూ... ఏమైంది ఆగిపోయారు" ఒకింత కంగారుగా అడిగింది భావన.

"ఏమీ లేదమ్మా, పొయ్యిమీద పెట్టిన పాలు పొంగిపోతుంటే స్టవ్ ఆఫ్ చేసి వస్తున్నాను. మామయ్యగారి ఆరోగ్యం కూడా మెరుగ్గానే ఉంది. అబ్బాయి డ్యూటీకి వెళ్లాడా? పిల్లలు వచ్చేశారా నీ వర్క్ ఫ్రమ్ హోమ్ ఎలా సాగుతోంది?" అసంపూర్ణంగా ఆపేసిన వాక్యం పూర్తిచేసి, బదులు ప్రశ్నలు వేసింది, జానకమ్మ.

"మీకు మొన్ననే చెప్పాను కదత్తయ్యా, రామ్ జాబ్ నుంచి ఫైర్ అయ్యారు. వేరే ట్రై చేస్తున్నారు కానీ అంత సులభంగా దొరికేలా లేదు. నా వర్క్ కూడా ఎంత కాలం ఉంటుందో చెప్పలేను. ఆయన మీకు తెలియనివ్వకూడదు అనుకున్నారు. కానీ నేను అలా ఉండలేకపోతున్నాను. కన్నవాళ్లకు చెప్పకుండా ఎలా అని..."

"అవునమ్మా... చెప్పావు కదా... అంతా త్వరలోనే సర్దుకుంటుంది లేమ్మా, బాధపడకండి. వాడున్నాడా?"

భర్త ముఖం చూసి మొబైల్ వాల్యూమ్ తగ్గించింది.

"ఉన్నారు అత్తయ్యా, ల్యాప్‌లో ఏదో సెర్చ్ చేస్తున్నారు."

అర్థమైంది జానకమ్మకు, కొడుకు మాట్లాడే మూడ్‌లో లేడని. వాడెప్పుడూ ఇంతే, వాళ్ళ నాన్నలాగే మాట్లాడడం చిరాకు. కానీ తల్లిదండ్రుల మీద ప్రేమకు కొదువలేదు. ఆయనకు ఏదో హెల్త్ చెకప్ చేయాలంటే ఈ మధ్యనే ఒక లక్షదాకా పంపాడు. అది పంపకముందే జాబ్ పోయిందని తర్వాత తెలిసింది. అర్థం చేసుకుంది ఆమె.

"సరేనమ్మా, మీరు ఏమీ దిగులుపడకండి. అవసరమైతే ఇండియా వచ్చేయండి. ఇక్కడే ఏదో ఒకటి చూసుకుని కలిసి ఉందాం అందరం" చెప్పింది.

"చూద్దాం అత్తయ్యా. ఇక్కడ ఇప్పుడు పొలిటికల్ స్ట్రాటజీ అస్సలు బాగాలేదు. ఉన్న ఉద్యోగాలు ఊడుతున్నాయ్. కొత్త ఉద్యోగాలకు దారి లేదు. అయినా ప్రయత్నిస్తున్నాము. వీలు కాకపోతే అప్పుడు మీరు అన్నట్టు చేయక తప్పదు కదా, బై" అంటూ ఫోన్ పెట్టేసింది కోడలు.

"అలాగేనమ్మా బై" కాల్ కట్ చేసి, కిచెన్లోకి నడవబోతూ ఒకసారి భర్త ముఖం వంక చూసింది. కళ్ళు మూసుకుని ఉన్నాడు రాఘవరావు. ఆయన భృకుటి ముడిపడి ఉంది.

ఎడమ దవడ కండరాలు బిగుసుకుని ఉన్నాయి. అత్తా కోడళ్ల సంభాషణ విని లోలోపల బాధ పడుతుంటాడు, తెలుసు తనకు. అలా అని అక్కడి నుంచి వెంటనే వెళ్లలేకపోయింది.

ఎందుకో కాస్త తేడాగా అనిపించింది ఆయన పరిస్థితి.

"జాగ్రత్త జానకమ్మగారూ. ప్రస్తుతానికి గండం గడిచింది. అలాగని మరీ ఎక్కువ రోజులు ఆలస్యం చేయడానికి వీలులేదు. ఎంత త్వరగా బైపాస్ చేస్తే అంతా మంచిది. ప్రస్తుతానికి మెడిసిన్స్ రాస్తున్నాను. అయితే ఒక్క విషయం. ఆయన మనసుకు బాధ కలిగించే విషయాలకు సాధ్యమైనంత దూరంగా ఉంచాలి" మైల్డ్ స్ట్రోక్ వచ్చి హాస్పిటల్‌లో జాయిన్ చేసినప్పుడు డాక్టర్ చెప్పిన మాట గుర్తుకొచ్చింది.

"ఏమండీ... ఇటు చూడండి. ఏమైంది మీకు, మాట్లాడండి..." ఒక్క ఉదుటన దగ్గరగా వెళ్ళి చెంపలు తడుతూ పిలవసాగింది జానకమ్మ.

ఇప్పుడిప్పుడే ముడతలు పడుతున్న ఆమె బుగ్గల మీదికి కన్నీళ్ళు కారసాగాయి నిశ్శబ్దంగా.

...........

తలంతా దిమ్ముగా ఉంది. దేహం గాలిలో తేలిపోతున్నట్లు, శరీరంలో ఏవేవో సూదులు గుచ్చుతున్నట్టు అనిపిస్తోంది. మూతిముక్కును కలిపి ఎవరో అదిమేస్తున్నారు... "జానకీ!" పిలుస్తూ, ముఖం మీద ఉన్న ఎవరిదో చేతిని బలంగా పట్టుకుని పక్కకు నెట్టేశాడు రాఘవరావు.

"అయ్యో, పేషెంట్ ఆక్సిజన్ మాస్క్ తీసేశారు.." వినిపించిన గావుకేకతో పాటు, తెల్లటి దుస్తుల్లో దేవత ఎవరో కళ్ళముందు ప్రత్యక్షమైంది. మరో తెల్లటి దుస్తుల దేవత ముఖాన్ని మళ్ళీ అదిమేస్తూ ఏదో వస్తువుపెట్టి బిగించింది.

పరిశీలనగా చూశాడు రాఘవరావు. వాళ్ళు దేవతలు కారు, నర్సులు. తను తొలగించి విసిరేసిన మాస్కు తిరిగి మూతికి బిగించారు. పైన సీలింగ్ ఫ్యాన్ తిరుగుతోంది.

కొంచెం పక్కలకు చూపు సారించాడు. తెల్లటి కర్టెన్లు కనబడ్డాయి.

వాటితోపాటు బెడ్ పక్కనే నిలుచుని తన ముఖం వంక ఆందోళనగా చూస్తున్న ప్రభాకర్ కూడా.

"వీడెప్పుడు వచ్చాడు. జానకి ఏదీ? అసలు తనకు ఏమైంది? హాస్పిటల్లో ఎందుకు ఉన్నాడు?"

"కంగారు పడకు రాఘవా, నీకేమీ కాలేదు. ఇంట్లో కొంచెం అస్వస్థతకు లోనైతే, పక్క ఫ్లాటు వారి సాయంతో చెల్లెమ్మ నిన్న హాస్పిటల్లో జాయిన్ చేసింది. తర్వాత నాకు ఫోన్ చేస్తే ఇలా వచ్చాను" స్నేహితుడి ముఖంలో పలికిన భావాలు అర్థం చేసుకున్న ప్రభాకర్ మృదువుగా చెప్పాడు.

ముఖానికి మాస్క్ ఉండడంతో ఏదో మాట్లాడాలని రాఘవరావు చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఆయాసంగా కూడా ఉంది.

"చెల్లెమ్మ డాక్టర్ పిలిస్తే వెళ్ళింది, అదిగో వచ్చేస్తోంది..." అతని పరిస్థితి గమనించి మళ్ళీ తనే చెప్పాడు ప్రభాకర్.

"అంతా సర్దుకుంటుంది అండీ, బాధపడకండి" భర్త దగ్గరగా వచ్చి ఆయన చేయి పట్టుకుంటూ చెప్పింది జానకమ్మ. ఆ వెంటనే అటు తిరిగి కన్నీళ్ళు ఒత్తుకుంది.

అంటే తనకు మళ్ళీ స్ట్రోక్ వచ్చిందా? ఆపరేషన్ అంటోంది, అంత డబ్బులు ఎక్కడి నుంచి తేవాలి? మొబైల్‌లో మాట్లాడడమే కాదు, కన్నీళ్ళు పెట్టడం కూడా చేతకాదు రాఘవరావుకు. కంటి బయటకు రావాల్సిన కన్నీళ్లను లోలోపలే అదిమిపెట్టి, గుండెలోకి దిగమింగుకోవడం వల్లే ఇప్పుడీ పరిస్థితి వచ్చింది.

డ్రిప్స్ పోతూనే ఉన్నాయి. మెడిసిన్స్ ఇస్తున్నారు. శరీరానికి అమర్చిన ఏవేవో వైర్లు తల వెనుక ఉన్న యంత్రాలకు అమర్చారు.

సాయంత్రానికి రాఘవరావు పరిస్థితి కొంత మెరుగుపడింది. మూతికి ఉన్న మాస్క్ తొలగించారు. ఇంకా ఆయాసం, నీరసం పూర్తిగా తగ్గలేదు కానీ, రెండు మాటలు మాట్లాడగలుగుతున్నాడు.

బెడ్ పక్కన కూర్చున్న జానకి వంక చూశాడు "ఇంకా ఎన్ని రోజులు ఉండాలట ఇక్కడ?" అడిగాడు మెల్లగా భార్యను.

"ఎల్లుండి ఆపరేషన్ చేస్తారట. దానికి ముందు ఈ రోజు, రేపు ఏవో చాలా

**"ఎల్లుండి ఆపరేషన్ చేస్తారట. దానికి ముందు ఈ రోజు, రేపు ఏవో చాలా టెస్టులు చేయాలట..." అంది.**

**"ఇప్పుడు ఆపరేషన్ వద్దు, డిశ్చార్జి చేసేయమని చెప్పు డాక్టర్లకి. నా ఆరోగ్యం బాగానే ఉంది, ఇంటికి వెళ్లిపోదాం" చెప్పాడు లేని శక్తిని కూడదీసుకుంటూ.**

టెస్టులు చేయాలట..."

"ఇప్పుడు ఆపరేషన్ వద్దు, డిశ్చార్జి చేసేయమని చెప్పు డాక్టర్లకి. నా ఆరోగ్యం బాగానే ఉంది, ఇంటికి వెళ్లిపోదాం" చెప్పాడు లేని శక్తిని కూడదీసుకుంటూ.

"మొన్న కూడా ఇలా భీష్మించుకోవడంవల్లే చివరికి ఈ పరిస్థితికి వచ్చారు. ఆపరేషన్ కచ్చితంగా చేయాలట, డాక్టర్లు చెప్పారు. మీ మాటలు ఇక నేను వినను" గొంతులోకి లేని కరుకుదనం తెచ్చుకని ఖరాఖండిగా అంది, జానకి.

"మన పరిస్థితులు తెలుసుగా జానకీ. అబ్బాయికి అక్కడ జాబ్ పోయింది. అవసరమున్నా లేకున్నా సమకూర్చుకున్న వస్తువులకు వాయిదాలు చెల్లించలేక సతమతమవుతుంటాడు. ఇక అమ్మాయి అంటావా..." కూతురిని తలచుకోవడం కూడా ఇష్టం లేనట్టు సగంలోనే మాట మింగేశాడు.

"ఏం మనం వాళ్ళిద్దరి

దయాదాక్షిణ్యాల మీదే ఆధారపడి బతకాలా? వద్దు. అందుకే డిశ్చార్జి అయి వెళ్లిపోదాం. తర్వాత దేవుడు ఎలా రాసిపెట్టి వుంటే అలా జరుగుతుంది”.

“ప్రభాకరన్నయ్య సాయం చేస్తానన్నారు మీ ఆపరేషన్‌కు. తర్వాత మీ రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో కొద్దిగా సేవ్ చేసుకున్నాం కదా, అవి ఉన్నాయి. అన్నయ్య సాయం తీసుకుని, మన ఊళ్ళో ఉన్న కొద్దిపాటి పొలం కూడా అమ్మేసి తర్వాత అప్పు తీర్చేద్దాం” అంది.

‘వాడా... మొన్ననే చిన్న కూతురి పెళ్లి చేశాడు. కొడుకు ఆఫీసులో ఏదో ఫ్రాడ్ చేస్తే అక్కడ మిగిలిన సేవింగ్స్ కట్టేసి వాడి ఉద్యోగం నిలబెట్టాడు. వాడి దగ్గర మాత్రం ఎలా వస్తాయి చెప్పు, అన్నేసి డబ్బులు.”

“లేదండీ, అన్నయ్యగారు నాతో చెప్పారు. ఈమధ్యనే వాళ్ళ స్వంత ఊళ్ళో ఫ్యాక్టరీ ఏదో పెట్టడానికి వీళ్ళ పొలం అడిగారట. అమ్మేసి కొడుక్కు కొంత ఇచ్చి, మిగిలింది తమ భార్యాభర్తల పేరుతో బ్యాంకులో డిపాజిట్ చేశారట. అది ఇచ్చి సాయం చేస్తామన్నారు. మీరు నాకు కావాలండీ. మళ్ళీ మళ్ళీ ఈ టెన్షన్లు, భయాలు నేను పడలేను” కళ్ళల్లో ఊరుతున్న నీళ్ళను చీరకొంగుతో తుడుచుకుంటూ చెప్పింది జానకమ్మ.

మారు మాట్లాడలేకపోయాడు రాఘవరావు. “సరే, కానివ్వు. నీ కోసం ఒప్పుకుంటున్నాను. కానీ ఆపరేషన్ అయిన వెంటనే మన ఊళ్ళో మిగిలిన చేరెడు మడిచెక్కతోపాటు, చాలకపోతే నీ నగలు కూడా అమ్మేసి, ప్రభాకర్ రుణం తీర్చేయాలి.” అన్నాడు.

“అలాగే ఆండీ. మీ మాట ఎప్పుడైనా నేను కాదన్నానా? అయితే ఆపరేషన్ విషయంలో మాత్రం మీరు నా మాట వినితీరాల్సిందే.” ముఖంలోకి వెలుగు వస్తుంటే చెప్పింది జానకమ్మ.

**“ప్రభాకరన్నయ్య సాయం చేస్తానన్నారు మీ ఆపరేషన్‌కు. తర్వాత మీ రిటైర్మెంట్ బెనిఫిట్స్‌లో కొద్దిగా సేవ్ చేసుకున్నాం కదా, అవి ఉన్నాయి. అన్నయ్య సాయం తీసుకుని, మన ఊళ్ళో ఉన్న కొద్దిపాటి పొలం కూడా అమ్మేసి తర్వాత అప్పు తీర్చేద్దాం” అంది.**

............

రాఘవరావు తీరిగ్గా కూర్చుని టీవీలో వార్తలు చూస్తున్నాడు. ఎవరో యువ రైతు... కాదు, ఎవరో కాదు ప్రకాషే. కుప్పంలో అరటి నార్లతో సిరులు పండిస్తున్నాడట. ఏదో చానల్‌కు ఇంటర్వ్యూ ఇస్తున్నాడు నర్సరీ ముందు నిలబడి. తన ఉపాధ్యాయ జీవితంలో ఎక్కువ భాగం గడిపింది ఆ కుప్పంలోనే. ఎస్జీటీగా కొత్తగా ఉద్యోగంలో జాయిన్ అయినప్పుడు, మళ్ళీ స్కూల్ అసిస్టెంటుగా పదోన్నతి పొందినప్పుడు.. వెళ్ళక తప్పలేదు. సహజమైన ఉత్సుకతతో చైర్లో కొంచెం ముందుకు జరిగాడు.

“వ్యవసాయం దండగన్న అభిప్రాయంలోనే ఉన్నారు ఇంకా చాలా మంది. అంత ఎందుకు మా మామయ్య గారిది కూడా ఇప్పటికీ ఇదే అభిప్రాయం. అగ్రికల్చర్ బీస్సీ చేసిన ఆయన ముద్దుల కూతురు సునంద, పండ్లు కూరగాయ మొక్కలను ఆధునిక పద్ధతుల్లో అంటుకట్టి, ఇంకా అత్యాధునిక సాంకేతిక పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చే కుప్పంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఇంటర్న్‌షిప్ కోసం వచ్చింది. ఆమెతో నాకు ఏర్పడ్డ పరిచయం ప్రేమగా మారింది. సునందను నాకిచ్చి పెళ్లి చేయడానికి నా కులం, మతం కంటే కూడా ఆయన దృష్టిలో ‘కూడు పెట్టని’ నా వ్యవసాయ నేపథ్యం అడ్డు వచ్చింది. నేరుగా నాతోనే ఆ విషయం చెప్పారు కూడా.”

“మరి సునందగారితో మీ పెళ్లి అయిందా సార్?” యాంకరమ్మాయి అడిగింది.

“సునందా ఇలా రా...” పిలిచాడు వెనక్కు తిరిగి. అరటి నార్లను ఆర్డర్ చేసిన వారి వ్యానుకు లోడ్ చేయిస్తున్న ఒకమ్మాయి చేతులు దులుపుకుంటూ వస్తున్న దృశ్యాన్ని కెమెరా క్యాప్చర్ చేసింది. “తన మాట కాదని ప్రకాష్‌ను పెళ్లి చేసుకున్నందుకు నాన్నకు చాలా కోపం వచ్చింది. మా ఇద్దరి ముఖం మీదే తలుపు మూసేశాడు. భర్త మాట జవదాటలేని ఫక్తు తెలుగింటి ఇల్లాలు మా అమ్మ. అమ్మా నాన్నలకు దూరమయ్యానని తప్ప, ఇక ఏ లోటూ లేదు నాకు. మేమిద్దరం అగ్రికల్చర్ బీస్సీ చేశాం. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా ఆధునిక వ్యవసాయ పద్ధతులను అమలుచేస్తూ నర్సరీ నడుపుతూ రెండు చేతులా ఆదాయం ఆర్జిస్తున్నాం” ఎంత సంతృప్తో సునంద ముఖంలో. “అవును, వ్యవసాయం కూడు పెట్టదు, అన్న అభిప్రాయం చాలా తప్పు. ఎన్నెన్నో సాంకేతిక వ్యవసాయ విధానాలు, యంత్రాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. తగిన శిక్షణ పొంది, అమలు చేశామా... చేరెడు నేలలో అయినా సిరులు పండించవచ్చు” ముక్తాయించాడు ప్రకాష్.

“జానకీ...” కేక వేశాడు రాఘవరావు.

“ఎందుకలా గావుకేక పెడతారు. ఇదిగో, వెనుకనే నిలుచున్నా. మీ కూతురు, అల్లుడు ఇస్తున్న ఇంటర్వ్యూ మీతో పాటే నేనూ టీవీలో చూస్తున్నా” భుజం తట్టి చెప్పి, పక్కనే వచ్చి కూర్చుంది జానకమ్మ.

ఎందుకో సిగ్గుగా అనిపించింది భార్యవంక చూడాలంటే రాఘవరావుకు. “నిజం చెప్పు, నా ఆపరేషన్‌కు సాయం చేసింది ప్రభారమేనా?” అడిగాడు మెల్లగా. “అన్నయ్యగారు... చాలా తపన పడ్డారు కానీ, చేయలేకపోయారు. నాకు తెలియకుండా మీ అల్లుడికి ఫోన్ చేసి మీరు హాస్పిటల్లో ఉన్న విషయం చెప్పారు...” ఏమంటారో నన్న సంశయంతో ఉన్న విషయం బిడియంగానే బయట పెట్టేసింది జానకమ్మ.

కాసేపు మాట్లాడలేదు.. ఆయనకు అర్థమైంది.. తను కాదన్న అల్లుడే తన ప్రాణదాతగా మారాడని. చాలాసేపు నిశ్శబ్దంగా ఉండిపోయాడు. తర్వాత భార్య ముఖం వంక ధైర్యంగా చూసి “సంక్రాంతి వస్తోంది కదా! ఆ మొబైల్ అందుకో, అల్లుడికి ఫోన్ చేసి పండక్కు సునందతో కలిసి ఇంటికి రమ్మని పిలవాలి” భుజం మీది తువ్వాలు సర్దుకుంటూ చెప్పాడు. గుండెల మీద నుంచి గంపెడు బరువేదో దిగిపోయినట్టు నిట్టూర్చిన జానకమ్మ, ముసిముసిగా నవ్వుతూ టీపాయ్ వైపు నడిచింది.

ఆ గ్రామంలో గాలి వీస్తే రాగం వినిపిస్తుంది, సెలయేరు పారితే తాళం వినిపిస్తుంది. కేరళంలోని పచ్చని ప్రకృతి ఒడిలో ఒదిగిపోయిన 'వల్ముట్టి' ఒక మారుమూల గ్రామం మాత్రమే కాదు అదొక సజీవ స్వరపేటిక, అక్కడ నివసించే ప్రతి ఒక్కరూ పుట్టుకతోనే సంగీతాన్ని శ్వాసగా మార్చుకున్నారు.

# తొలి సంగీత గ్రామం 'వల్ముట్టి'

జనాభా లెక్కల ప్రకారం అది 55 కుటుంబాలు నివసించే ఒక చిన్న కుగ్రామం కావచ్చు. కళాకారుల లెక్కన చూస్తే అదొక అద్భుతం. కేరళంలోని వల్ముట్టి గ్రామంలోని ఆ కుటుంబాలలో ప్రతి ఒక్కరూ శిక్షణ పొందిన గాయకులే కావడం విశేషం. ప్రతి గడపలోనూ ఒక సంగీత విద్వాంసుడు నివసించే ఈ 'సంగీత గ్రామం' ఇప్పుడు ప్రపంచం దృష్టిని ఆకర్షిస్తోంది. కేరళం రాష్ట్రంలోని పాలక్కాడ్ జిల్లాలో చిట్టూరుకు సమీపంలో సంగీత గ్రామం వల్ముట్టి నెలకొని ఉంది.

## సంగీతమంటే వారికి ప్రాణం

సంగీతమంటే ఆ గ్రామ వాసులకు ప్రాణం. పాటలే అక్కడి ప్రజలకు జీవనాధారం. అక్కడ ఉండేది కేవలం 55 కుటుంబాలే. అయినప్పటికీ వాళ్లు పాడిన పాటలు మాత్రం వేలల్లో ఉంటాయి. ప్రతి ఇల్లూ సంగీత పాఠశాలే. ఎందుకంటే చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అందరి గొంతు పాటలతోనే నిండి ఉంటుంది. ఆ గ్రామంలో ఏ గడప తొక్కినా సరిగమలు వినిపిస్తాయి. ప్రతి ఇంట్లో ఎవరో ఒకరు పాటలను హమ్ చేస్తూనే ఉంటారు. ఇక సాయంత్రం అయితే చాలు అందరూ అరుగులపైకి చేరి గాన గంధర్వులైపోతారు. అందుకే ఈ గ్రామాన్ని మన దేశంలోనే మొదటి 'మ్యూజిక్ విలేజ్'గా కేరళం ప్రభుత్వం ప్రకటించింది. ముఖ్యంగా ఆ ఊళ్లో ఆడవాళ్లు తమ కుమార్తెలకు, మనవరాళ్లకు వేల సంవత్సరాల నుంచి సంగీతాన్ని వారసత్వ ఆస్తిగా ఇస్తున్నారు. ఈ సంప్రదాయం అక్కడ అనాదిగా వస్తోంది. అంతేకాదు అక్కడ పిల్లలు రాయడం రాకముందే సంగీతాన్ని నేర్చుకుంటారు. అందుకే ఆ ఊరిని 'పొట్టు గ్రామం' (పాటల గ్రామం) అని అక్కడి వారంతా పిలుచుకుంటారు. ఇక్కడ నివసించే వారంతా పాణర్ తెగకు చెందినవారు. పరిశోధకుల అభిప్రాయం ప్రకారం పాణర్లు ప్రాచీన తమిళ సమాజంలో సంస్కృతికి వారధులుగా ఖ్యాతినార్జించారు. ఒకప్పుడు వీళ్లంతా ఊరూరా తిరుగుతూ పాటల రూపంలో కథలు చెప్పేవారట. అప్పుడు వాళ్లకది జీవనాధారమే అయినప్పటికీ క్రమేపీ నిత్యజీవితంలో భాగం అయిపోయింది. కాలం



మారినా సంప్రదాయాన్ని వదల్లేదు అక్కడి వాళ్లు. ఫలితంగా అక్కడి నుంచి చాలామంది సంగీత కళాకారులు పుట్టుకొచ్చారు. పురుషులు సంగీత వాద్యాలు తయారు చేస్తే, స్త్రీలు పాటలు పాడుతుంటారు. రోజూ ఉదయం దేవుణ్ణి మేల్కొలపడంతో మొదలవుతుంది ఆ ఊళ్లో తొలి రాగం. సాయంత్రం దీపాలు పెట్టే వరకూ పాటలు వినిపిస్తాయి. వార్తాపత్రికలు, డాక్యుమెంట్లు, సోషల్ మీడియా లేని కాలంలో వాళ్లు సంస్కృతి, సంప్రదాయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేశారు. ప్రత్యేకంగా సంగీతం నేర్పే తరగతి గదులు లేవు.

పాటలకు సంబంధించిన పుస్తకాలు కూడా లేవు. ఒక తరం నుండి మరో తరం వారు ఈ పాటలను నేర్చుకుని పాడటం విశేషం. కానీ సంగీతం ఎప్పటికీ సజీవంగా ఉంటుందని మాత్రం వాళ్ల నమ్మకం.

అధికారికంగా మ్యూజిక్ విలేజ్ గుర్తింపు లభించాక గ్రామాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య కూడా పెరిగింది. ముఖ్యంగా ఆయా పర్వదినాల్లో విష్ణు ఆలయంలో జరిగే సంగీత కచేరీలను చూడటానికి పర్యాటకులు అమితాసక్తి కనబరుస్తుంటారు.



వల్ముట్టిలో సాయంత్రమైతే చాలు వీధి దీపాల వెలుగులతో పాటు వినసొంపైన పాటలు వినిపిస్తాయి. పిల్లలందరూ ఇంటి ముందు అరుగుల పైకి చేరి భక్తి పాటలు పాడుతుంటారు. వృద్ధులైతే విష్ణు ఆలయానికి చేరుకుని భక్తిగీతాలను ఆలపించడంలో మునిగిపోతారు. శివుని పాటలు, కృష్ణుడిపై భక్తి పాటలు, సంప్రదాయ మేల్కొలుపు పాటలు పాడతారు. ఏదైనా పండగ వచ్చిందంటే చాలు తెల్లవారుఝాము వరకు పాటలు వినిపిస్తూనే ఉంటాయి. అలా అని వీరు సంగీతంలో ఎలాంటి శిక్షణ తీసుకోలేదు. వల్ముట్టి ప్రజలకు సంగీతం ఒక అలవాటు, సాధన, వారసత్వ ఆస్తి,



## సంగీతం వారి వంశపారంపర్య ఆస్తి

పలుపెట్టి గ్రామంలో ముఖ్యంగా ఆడవాళ్లు తమ కుమార్తెలకు, మనవరాళ్లకు వేల సంవత్సరాల నుంచి సంగీతాన్ని వారసత్వ ఆస్తిగా ఇస్తున్నారు ఈ సంప్రదాయం అక్కడ అనాదిగా వస్తోందట. అందరు పిల్లలు ఆడుకుంటూ పెరిగితే, ఈ ఊరిలో పిల్లలు మాత్రం భక్తి పాటలు పాడటం నేర్చుకుంటూ పెరుగుతారు. ఇక్కడ వారంతా పాణర్ తెగకు చెందినవారు. వీరు పూర్వం సంగను వంశ రాజుల కాలంలో ఆస్థాన సంగీత విద్వాంసులుగా ఉండేవారు దాదాపు 2,200 యేళ్లకు పైగా వీరు తమ సంగీత సంప్రదాయాన్ని కాపాడుకుంటూ వస్తున్నారు. వీరు ముఖ్యంగా 'ముయిల్ ఉనార్తు పొట్టు' వంటి జానపద, భక్తి గీతాలను పాడుతారు గ్రామంలోని విష్ణు ఆలయం, మరికొన్ని ఆలయాలు వీరి సంగీత ప్రదర్శనలకు ప్రధాన కేంద్రం ఈ పురాతన కళను, కళాకారులను ప్రోత్సహించడానికి కేరళం ప్రభుత్వం వల్ముట్టిని రాష్ట్రపు మొదటి 'పొట్టు గ్రామం'గా ప్రకటించింది. తుయిల్ ఉనార్తు పాట్టు అనేవి దేవుళ్లను మేల్కొలిపే 'సుప్రభాతం' వంటి భక్తి గీతాలు, శివుడు, కృష్ణుడిని స్తుతిస్తూ పాడే ఈ పాటలను ఎలాంటి రాతపూర్వక నోట్స్ లేకుండా కేవలం జ్ఞాపకశక్తితో తరతరాలుగా నేర్చుకుంటున్నారు.

## ఆధునికతకు ఆహ్వానం

పాణర్ పాట్టు అనేది పాణర్ల ప్రత్యేకమైన జానపద శైలి. ఒకప్పుడు వీరు రాజ దర్బార్లలో వార్తలను, కథలను పాటల రూపంలో వినిపించేవారు. పూర్వం ఇక్కడివారు 'యాజ్' 'కుజల్' వంటి పురాతన వాయిద్యాలను వాడేవారు నేడు వాటితో పాటు గిటార్, డ్రమ్స్ వంటి ఆధునిక వాయిద్యాలను సైతం ఉపయోగిస్తూ జానపదానికి సరికొత్త రూపాన్ని ఇస్తున్నారు. వల్ముట్టి విష్ణు ఆలయాలు గ్రామానికి గుండెకాయ వంటిది. పండుగ రోజుల్లో రాత్రంతా సాగే సంగీత, నృత్య ప్రదర్శనలు పర్యాటకులకు ప్రధాన ఆకర్షణ.




పర్యాటకులు ఇక్కడి ఇళ్ల అరుగులపై కూర్చుని కళాకారులతో ముచ్చటించవచ్చు. వారు ఆశువుగా పాడే పాటలను వినవచ్చు. పర్యాటకులకు ఆసక్తి ఉంటే స్థానిక కళాకారుల వద్ద ఈ జానపద గీతాలలోని మెళకువలను నేర్చుకునే అవకాశం కూడా ఉంది. తమ సంప్రదాయాలను సజీవంగా ఉంచేందుకు వల్ముట్టి మహిళలు కృషి చేస్తున్నారు. సంగీతంలో మాస్టర్ డిగ్రీలు చేస్తూ ఆధునికతకు స్వాగతం పలుకుతూ సంగీతంలో శిక్షణ కూడా ఇస్తున్నారు. కొందరైతే కేరళం జానపద అకాడమీ రాష్ట్ర అవార్డును గెలుచుకున్నారు. సంగీతం కోసం జీవితాంతం కృషి చేసినవారు కూడా ఉన్నారు. ఇక్కడ ప్రతి ఒక్కరూ సంగీత విద్వాంసులే. వారి పూర్వీకులు ఉత్సవ సమయాల్లో పాటలు పాడటం ద్వారా జీవనోపాధి పొందారు. వారి ప్రదర్శనలు చూస్తూ పెరిగిన ఈ తరం వారు పెద్దల అడుగుజాడల్లో నడుస్తున్నారు. పూర్వీకులు ఏర్పరచిన దారిలో వీరంతా కొనసాగుతున్నారు. సంగీతంతో కలిసిపోయి జీవిస్తున్నారు.

విశేషమేమిటంటే ఇప్పుడు ఉన్న వృద్ధులంతా సంగీతం నేర్చుకోవడానికి ఎప్పుడూ కళాశాలకు గానీ, పాఠశాలలకు గానీ వెళ్లలేదు. పదేళ్ల వయసు నుంచి పాటలు పాడటం వారి జీవితంలో భాగంగా మారింది. ఈ గ్రామంలో చాలా మంది అవార్డు పొందిన గాయకులు కనిపిస్తారు. సినిమాల్లో పాటలు పాడినవారూ ఉన్నారు. ఆర్థిక, సామాజిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా, తమ గ్రామాన్ని మొదటి మ్యూజిక్ విలేజ్‌గా ప్రకటించడం వాళ్లకు ఎంతో ఊరటనిచ్చింది. మొత్తానికి కొన్ని వేల ఏళ్లనాటి సంప్రదాయాన్ని ముందుకు తీసుకెళ్లడానికి కొత్త తరం ప్రయత్నిస్తోంది.

– షేక్ అబ్దుల్ హకీం జాని

# 'క్షుద్ర వేధ' అంటే ?


వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458




**బి.పరంజ్యోతి, అమలాపురం**

**ప్రశ్న: క్షుద్ర వేధ గురించి విపులంగా తెలియజేయగలరు.**

**జవాబు:** 'అపరాజిత పృచ్ఛ' అనే వాస్తు గ్రంథంలో గృహంలో కొన్ని రకాల చెట్లు ఉన్నట్లయితే కలిగే దోషం 'క్షుద్రవేధ దోషము'గా పేర్కొన్నారు. గృహావరణంలో ఉండవలసిన మొక్కలు, చెట్లు, తేనెపట్టులు, ఉప్పలమ్మలు, మొండిచేతులు, పుట్టలు, బొరియలు మొదలైన అనేక విషయాల గురించి వాస్తుశాస్త్రంలో విస్తారమైన, మర్మపూరితమైన విషయాలెన్నో ప్రస్తావించారు. ఆవరణలో 'కొన్ని చెట్లు ఉండటం' దోషం. ఆవరణలో ఏ చెట్టు ఎక్కడ ఉండాలో అక్కడ ఉన్నట్లయితే అది దోషం కాదు. ఆవరణలో ఏ చెట్టు ఎక్కడ ఉండకూడదో అక్కడ ఉన్నట్లయితే అది దోషం. ఇటువంటి అనేక విషయాలు ముందు జాగ్రత్త కోసం తెలుసుకుని ఉండటం అందరికీ అవసరం. వాస్తు శాస్త్రంలో ఎక్కడ కూడా చెట్లని నరికివేయాలని లేదు. గృహానికి ఏ చెట్టు ఎటువక్కన ఉంటే మంచిది కాదో వివరించారు. ఒక మొక్కను నాటిన తరువాత కాలక్రమంలో అది పెరిగి పెద్దదవుతున్నప్పుడు భూమి అడుగున విస్తరించే వేర్ల వలన కాంపౌండు గోడలకు గానీ, ఇంటి పునాదులకు గానీ భంగం వాటిల్ల కూడదు. వృక్ష పైభాగం శాఖోపశాఖలుగా విస్తరించినప్పుడు భవనమునకు భంగం వాటిల్లకూడదు. ఈ విధంగా భంగములు వాటిల్లటం వలన కూడా వాస్తు దోషాలు ఏర్పడి చెడు ఫలితాలను పొందవలసి వస్తుంది. అందువల్ల వృక్షాలు ఏ ఆటంకాలు లేకుండా పెరిగి విస్తరించటానికి అవసరమైనంత ఖాళీ స్థలం(ఆవరణ) ఉన్నప్పుడు మాత్రమే వృక్షాలను పెంచటం మంచిది. గృహావరణలో పులిచింత, వాకుడు, నల్లయుప్పి, నేలములగ, తేనెపట్టు ఉన్నట్లయితే 'క్షుద్రవేధ' అనే దోషం ఆ గృహానికి సంభవిస్తుందని తెలిపారు.

'క్షుద్రవేధ పశుహాని కరం భవేత్' అనే శాస్త్ర వచనం ప్రకారం క్షుద్రవేధ వలన 'పశుహాని' కలుగుతుంది. నేలములగ చెట్లు, తేనెపట్టుల విషయంతో మత భేదాలున్నాయి. తేనెపట్టులు గృహానికి దక్షిణ, నైరుతి, పడమర దిక్కుల్లో ఉంటే చెడు ఫలితాలు; తూర్పు, ఈశాన్య, ఉతనతర దిక్కుల్లో ఉంటే 'చెడు ఫలితాలు ఉండవని' వివరించారు.

## ఆ పొలం కొనవచ్చా?

**ఎస్.పరాంకుశం, నిడదవోలు**

**ప్రశ్న: 0.6 సెంట్ల పొలం, నా .50 సెంట్ల పొలానికి ఆనుకుని ఉన్నది. చేను వెంట చేను కదా అని కొన్నాను. నేను కొన్న 0.69 సెంట్ల పొలంతో కలిపితే 1.19 సెంట్ల స్థలంలో దోషం ఉన్నట్లుగా అనిపిస్తున్నది. కనుక తగిన సలహా ఇవ్వగలరు.**

**జవాబు:** మీ 0.50 సెంట్ల పొలానికి కొత్తగా కొన్న 0.69 సెంట్ల పొలాన్ని కలిపినప్పుడు(రెండింటికి కలిపి) ఈశాన్యం తగ్గుతున్నది. ఆ ఈశాన్యం వైపు పొలాన్ని కూడా కలుపుకున్నట్లయితే ఈ దోషం సవరించబడుతుంది.



## వాస్తు దోషాలున్నాయా?

**ఎ.ఈశ్వర్, హైదరాబాద్**

**ప్రశ్న: మేం ఈ నూతన గృహాన్ని ప్లానులో చూపించిన విధంగా తూర్పు భాగంలో వున్న పాత ఇంట్లో ఉండి నిర్మించాం. గృహ శంకుస్థాపనలో గానీ, ఏవైనా వాస్తు దోషాలు వుంటే తెలుపగలరు.**

**జవాబు:** ఒక క్షేత్రంలో పాత ఇంట్లో ఉంటూ అదే క్షేత్రంలో శంకుస్థాపన గావించి కొత్త ఇంటిని నిర్మించడం తగని పని. నూతన గృహ నిర్మాణం చేపడితే క్షేత్రంలో పాత ఇంటి భాగాలు, సగం కాలిన గోడలు, పాతింటి పునాదులు మొదలైనవి ఉండకూడు. ఇక శంకుస్థాపన, గృహ ప్రవేశాది సమయంలో ఏమైనా వాస్తు దోషాపూరిత కార్యాలు జరిగినట్లయితే ఆ విషయాలు చాలావరకు క్షేత్రాన్ని ప్రత్యక్షంగా చూస్తేనే తెలుస్తాయి.

---

వాస్తు విద్వాన్ డా॥ దంతూరి పండరినాథ్ పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:

సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................

పుట్టిన తేది : ............................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: .................

చిరునామా:...............................................

# సుదీర్ఘ ప్రయాణం సునాయాసంగా..

సాధారణంగా దేశీయ విమానాల్లో ఒక నగరం నుంచి మరో నగరానికి విమాన ప్రయాణం చేయడానికి దాదాపు గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. ఇలా ఒకటి లేదా రెండు గంటల విమాన ప్రయాణ సమయాన్ని గడపడం చాలా సులభం. చూస్తుండగానే గమ్యస్థానానికి చేరుకుంటాం. కాని అమెరికా లేదా ఆస్ట్రేలియా లేదా యూకె లాంటి ప్రాంతాలకు విదేశీ విమాన ప్రయాణాలను చేస్తున్నపుడు కనీస సమయం నాలుగు నుంచి పద్దెనిమిది గంటల వరకు కూడా సమయం పడుతుంది. దీనికి తోడుగా మధ్యలో విమానాలను మారడం కూడా ఇబ్బందికరంగా ఉంటుంది. ఇంత ఎక్కువ సమయం విమానంలో కదలకుండా ఎకానమీ క్లాస్‌లో కూర్చుని ప్రయాణం చేయడం, సమయం గడపడం చాలా ఇబ్బందిగా ఉంటుందని ప్రయాణం చేసిన వారికే అర్థం అవుతుంది. విమాన ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకునే మార్గాలు:

## వినోదాత్మకం మార్గాలు

విమాన ప్రయాణాలలో కొందరు తమకు నచ్చిన సినిమాలను, సంగీతాన్ని లేదా పాటలను ఫోన్లో/పోడ్‌కాస్ట్‌లో డౌన్‌లోడ్ చేసుకొని కూడా ప్రయాణ సమయంలో వాటిని వీక్షిస్తారు. ఇంకొందరు వీడియో గేమ్స్ ఆడుకుంటూ సమయాన్ని గడుపుతుంటారు. మన అభిరుచులకు తగినట్లుగా మనకు నచ్చిన చిత్రాలను/డ్రాయింగ్స్ /కలరింగ్ గీయవచ్చు, నవలలు చదవచ్చు, సృజనాత్మక అల్లికలు చేయవచ్చు. కొద్ది మంది మన ప్రయాణ అనుభవాలను కూడా ఆసక్తికరంగా రాస్తారు. విమానంలో అందించే ఆహారాన్ని పరిమిత స్థాయిలో తీసుకోవాలి. డౌన్‌లోడ్ చేసుకున్న విజ్ఞానదాయకమైన ఈబుక్స్ లేదా మన వెంట తీసుకువెళ్ళిన మనకు నచ్చిన పుస్తకాలను చదువుతూ సమయం గడపడం సముచిత మార్గంగా ఉంటుంది. మన భవిష్యత్తు కార్యక్రమాలను లేదా మనం రానున్న రోజుల్లో మన ప్రయాణాలను, చేయవలసిన పనుల ప్రణాళికలు చేసుకోవడానికి ఈ సమయం చక్కగా ఉపయోగపడుతుంది. మన ఈమెయిల్స్ ను చూసుకోవడంతో పాటు వాటికి సమాధానాలు ఇవ్వడం, మిత్రులకు లేదా ఇతరులకు కొత్తగా చేయవలసిన ఈమెయిల్స్ ను పూర్తి చేయడం మరో



మార్గంగా ఉంటుంది. విమానంలో వైఫై సౌకర్యం లేకపోయినా విమానం దిగగానే ఈమెయిల్స్ బట్వాడా జరుగుతుందని మరువరాదు. మనకు నచ్చిన రచనలు చేసుకోవడానికి కూడా ఈ సమయాన్ని వినియోగించుకోవచ్చు. అధికారులైతే ఆఫీసుకు సంబంధించిన ముఖ్యమైన ఫైల్స్ ను క్లియర్ చేయవచ్చు. సోషల్ మీడియా వేదికను చూసి కూడా అవసరమైతే సమాధానాలను ఇవ్వండి. క్రాస్ వర్డ్ ఫజిల్స్ ను పూర్తి చేయవచ్చు.

## ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలు

విమాన ప్రయాణ సమయంలో కొంత భాగాన్ని ప్రాణాయామం, ధ్యానం, స్వల్ప కదలికలు కలిగిన వ్యాయామాలు, నేత్రాలకు సంబంధించిన వ్యాయామాలు లాంటివి చేయడం మానవద్దు. 10-15 గంటలు కదలకుండా కూర్చోవడం ఇబ్బంది కాబట్టి మధ్య మధ్యలో కొద్దిసేపు లేచి నడవడం, శరీర భాగాలను కదిలించటం చాలా ఉత్తమమైన మార్గం. మెడకు నెక్ పిల్లో పెట్టుకోవడం మంచిది. కిటికీ పక్కన సీటు లభిస్తే ఆకాశ అందాలను/ మేఘాలపై తేలిపోతున్నట్లుగా అనుభూతులను ఆస్వాదిస్తూ, ముఖ్యంగా విమానం టేకాఫ్ లేదా ల్యాండింగ్ సమయాల్లో ప్రకృతి అందాలను చూస్తూ మానసిక ఆనందాన్ని పొందవచ్చు. సుదీర్ఘ ప్రయాణంలో తప్పనిసరిగా మధ్య మధ్య నీరు తాగడం మరువవద్దు. చేవుల్లో దూది/ఇయర్ ఫోన్స్ పెట్టుకొని ప్రశాంతంగా నిద్రకు పోవడానికి లేదా విశ్రాంతి తీసుకోవడం మంచిది. ప్రయాణ సమయంలో వదులుగా ఉన్న లేదా కంఫర్ట్ ఫిట్ వస్త్రాలు కట్టుకోవడం, తేలికై షూ తేలికైన పాదరక్షలు వేసుకోవడం మంచిది.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఓ కళ. అందుకే కదా 'టైమ్ ఈజ్ మనీ' అంటాం. కనుక అధిక గంటలు విమాన ప్రయాణాలు చేస్తున్నవారు ఆ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఉత్తమం. ఇలాంటి ప్రయాణాలు చేయవలసి వస్తే వినోద, విజ్ఞాన, విశ్రాంతి, ఆరోగ్య సంబంధమైన విషయాలకు సమయాన్ని కేటాయిస్తూ, మన ప్రయాణాన్ని ఆనందమయం చేసుకుందాం, అద్భుతంగా నవ్వుతూ గమ్యస్థానాలను చేరుకుందాం.

– డా॥ బి.మధుసూదన్ రెడ్డి

# వడ్డించడమూ ఓ కళే!

ఒకరిని భోజనానికి పిల్చినప్పుడు వారికి చక్కటి వంట పదార్థాలు చేసి పెట్టడం ఎంత ముఖ్యమో అలాగే వాటిని వడ్డించడానికీ ఒక తీరుంది.. అది చక్కగా ఉండాలంటాడు కవిసార్వభౌముడు శ్రీనాథుడు.

ఏదో ఒకటి తయారు చేసి కడుపు నిండా పెట్టామనుకోవడం కన్నా ఎంత ప్రేమగా, ఎంత ఆప్యాయంగా పెట్టామన్నది ప్రధానం. తల్లులకైతే తమ పిల్లలతో ఎలా తినిపించాలో బాగా తెలుసు. వారికి తెలిసినంతగా నాన్నలకు అంతగా తెలీదు.

కాశీఖండంలో శ్రీనాథుడు ఓ చోట వడ్డన తీరుని చక్కగా వర్ణించాడు. అది ఎప్పటికీ అనుసరణీయమే. పెద్దలకు అన్నం పెట్టడంలోనూ, సాధువులకు భిక్ష వేయడంలోనూ ఆ పద్ధతి పాటించడం వల్ల పెట్టే మనసుకెంత తృప్తి కలుగుతుందో వేరేగా చెప్పక్కర్లేదు.

"ముంగిట గోమయంబున గోముఖము దీర్చి.. గ్రమకరముల బ్రాహ్మణాంగనలు కాశి నన్నపూర్ణభవాని కట్టనుగు జెలులు" అనే సీసపద్యంలో ఇలా అంటాడు శ్రీనాథుడు...

"తొలుత ఆవుపేడతో అలకాలి. నాలుగు వైపుల



ముగ్గుకర్ర పెట్టాలి. ముగ్గు కర్ర అంటే తిన్నగా సరళ రేఖలు గీయాలి. అవి ఏం చెప్తాయంటే ఈ ప్రాంతానికి ఇదే సరిహద్దు అని తెలియజెప్తాయి. అనంతరం వచ్చిన అతిథిని అక్కడ నిల్చోమని చెప్పాలి. అర్ఘ్యం, పాద్యం, పువ్వులు, గంధం వంటి షోడశోపచారాలతో పూజించాలి.

ఆ తర్వాత బంగారు గరిటతో అన్నం మీద నెయ్యి పోయాలి. వండిన పదార్థాలను భక్తితో, విశ్వాసంతో తృప్తిగా వడ్డించాలి. దీన్నే 'మాధుకర భిక్ష' ఇచ్చే పద్ధతి అంటారు.

ఇక ఇదంతా అయిన తర్వాత అతిథులకు భోజనం పెట్టే సమయంలో వారి పంక్తి మధ్యలోకి ఇంటి యజమాని వచ్చి అన్నం వడ్డించాలి.

ఇలా ఉండగా– వడ్డించిన విస్తరిలో ఉన్న పదార్థాలను తమ నిత్యార్చన మూర్తికి నివేదించి మరీ భుజిస్తారట ఆస్తికులు" అని శ్రీనాథుడు 'హరవిలాసం' అనే తన కావ్యంలో చెప్పాడు.

అతిథులకు భోజన సమయంలో ప్రశాంతంగా భుజించటానికి వట్టివేళ్ళ విసనక్రరతో వీచాలట. ఈ మర్యాదను 'దమయంతి పెండ్లి రోజు' అనే ఘట్టంలో వర్ణించాడు శ్రీనాథుడు.

అసలు వడ్డించడం అనేది ఒక కళ. దానికెంతో నేర్పరితనం అవసరం. వడ్డించే పదార్థాలతో పాటు అభిమానాన్ని కూడా రంగరించాలి. ఏదో ఒకటి పెట్టడం కాదు, ఎంత తృప్తిగా పెట్టామన్నది ముఖ్యం.

ఇక్కడే ఓ విషయం చెప్పుకోవాలి. భోజన కార్యక్రమం ఆనందంగా, ఆహ్లాదంగా సాగాలంటే పెట్టేవారే కాదు, తినేవారు కూడా అలాగే నడచుకోవాలి. ఆబగా తినడమో రుసరుసలాడుతూ తినడమో చేయకూడదు. అది సరైన పద్ధతి కాదు. తింటున్నప్పుడు రుచుల గురించి చెప్పకూడదట. ఎందుకంటే అధిక శాతం మందికి రుచులు చెప్పడం సరిగ్గా తెలీదు. తనకు సరిగ్గా లేదనుకున్న రుచి మరొకరికి బాగుండొచ్చు. కనుక తను తిననంత మాత్రాన అదో ఒకటి చెప్పి తినాలనుకున్న వారితోనూ తిననివ్వకుండా చేయడం భావ్యం కాదంటాడు శ్రీనాథుడు.

– యామిజాల జగదీశ్

## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్, ఆదివారం వార్త**, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

## రచయిత-పాఠక ప్రజ్ఞానిధి

తెలుగు సాహిత్యంలో, పుస్తక సమీక్ష, రచనా విలువలు క్లుప్తీకరించబడిన భావ సారాంశాన్ని అందించే ప్రక్రియగా రచయితల రచనా మేధా సంపన్నతను వెలుగులోకి తెచ్చే సత్కృషి. కేవలం శీర్షిక, అట్టమీది ఆకర్షణ రచనలోని ఇతివృత్త సారాన్ని అందించలేనందున, చదువరులు ఆ పుస్తకం చదవాలో అక్కర్లేదో సమీక్షకులు చెప్పగలగాలి. సుమారు పుష్కర కాలం నుంచి లబ్ధ ప్రతిష్ఠులైన రచయిత కూర చిదంబరం సమీక్షా సౌరభాలు వెలువరించటం అభినందనీయం. పుస్తక రచయితకు పాఠకునికి మధ్య వారధిగా ఈ సమీక్షకులు కృతకృత్యత సాధించారు. దాదాపు అర్ధ శతాబ్దిగా కథలు, గేయాలు, వ్యాసాలు, కవిత్వం తదితర సాహితీ వ్యాసంగంతో బాంధవ్యంగల తెలుగునాట



సుపరిచితులైన రచయిత చిదంబరం, పుస్తకంలోని ఆత్మను అత్యంత ప్రతిభావంతంగా పట్టుకోగలరని రచయితలకు తెలుసు. అందుకే వారు, వీరి సమీక్షా రచన కోసం ఎదురు చూస్తుంటారు. రచయితకు న్యాయం చేయటానికి సమీక్షకునిగా చిదంబరం సహనం, ఆసక్తితో అధ్యయనానికి, మేధా విమర్శకు, విశ్లేషణకు ప్రాధాన్యత యిచ్చే సానుకూల వ్యక్తిత్వంగల రచయితగా ఈ సంపుటిలోని సమీక్షలు సమీక్షకుని ప్రజ్ఞను వ్యక్తీకరిస్తున్నాయి.

**(సమీక్షా సౌరభాలు-రచన: కూర చిదంబరం; వెల: రూ.300/-లు; ప్రతులకు: సౌమిత్రి ప్రచురణలు, 6-1-118/19, పద్మారావునగర్, సికింద్రాబాద్)**

---

**పుస్తక సమీక్ష**

## అపురూప కథలు

హృషికేశ్ పాండా ఒరియాలో రాసిన 17 కథలను ఆంగ్లం నుంచి స్వాతీ శ్రీపాద తెలుగుసేత చేసారు. ఆంగ్లంలోకి డా.లిపి పుష్పానాయక్ అనువదించిన ఈ కథలు ఇతివృత్తం, శైలి, భాష మామూలు కథలకు భిన్నంగా చదవటం కంటే, అనుభవింపచేస్తున్నాయి. ఆకలిచావుల కమీషన్ నివేదిక, యదార్థ, జీవన వ్యథను ప్రతిబింబించేసే కథనం. ప్రేమలో పడిన సావిత్రి, భర్త రాజా ఆస్వామిన్ పడిన పాట్లు, ఈ సంపుటిలోని కథలు అన్నీ ఎక్కడి నుంచి ఎక్కడకో పాఠకున్ని తీసుకుపోతాయి. ఈ కథలలో స్త్రీ పాత్రలు స్వేచ్ఛగా వాంఛించి ప్రేమిస్తాయి. ప్రకృతి ఏదో రూపంలో పలకరిస్తూ ఉంటుంది. పోలీసులు, న్యాయస్థానాలు కనపడుతుంటాయి. 'అందరూ ఏకాకులే' కథలో బాస్నా ప్రేమిస్తుంది. కానీ ప్రేమలేఖ రాసిన యువకుడు ఒంటరిగా ఉండిపోతాడు. ప్రేమ భావనను తనదైన శైలిలో,




తనదైన మనసును తాకే అంశాలతో, మానవీయ స్పృహతో చదువరులు ఊహించలేని వైవిధ్య స్పర్శతో హృషీకేశ్ పాండా రాసిన కథలు అనువదించి, తెలుగు చదువరులకు అందచేసిన రచయిత్రి స్వాతి శ్రీపాద అభినందనీయమైన తాత్త్వికత, ఉదాత్తతను కథా రూపంలో అందించారని, గాజునీడలను వ్యక్తీకరించటానికి దోబూచు మాటలు లేవని, అనుభూతి తప్ప మరో వ్యక్తవ్యం సాధ్యం కాదని ఈ సంపుటి స్పష్టం చేస్తోంది.

**(గాజునీడలు(కథలు)-రచన: హృషికేశ్ పాండా; అనువాదం: స్వాతీ శ్రీపాద; వెల: రూ.300/-లు; ప్రతులకు: స్వాతి శ్రీపాద, ఎ102, క్రిటిక్, రోడ్ నం.5, ఇంద్రప్రస్థ కాలనీ, బండ్లగూడ, నాగోల్, హైదరాబాద్-500 068)**

---

## జీవితాల్లోంచి కథా వస్తువులు

డా॥ అంబల్ల జనార్దన్ 'ప్రాణధార' కథాసంపుటిలో నలభై కథలున్నాయి. ఉమ్మడి కుటుంబాల బాధ్యతలు, రైతుల సమస్యలు, గృహిణులు, యువత ఎదుర్కొనే ఇబ్బందులు జీవితాల లోంచి కథావస్తువులను ఎంపిక చేసుకొని కథలు రాయటంతో రచయిత జనార్దన్ తెలుగు కథా రచయితలలో ప్రతిభావంతునిగా గుర్తింపు పొందుతున్నారు. 'ఉబలాటం సరిపోదు' కథలో మంచి కథకునిగా ఎదగటానికి మార్గదర్శకత్వం,




'ప్రాణధార'లో పాపతో పాలబంధం వివాహ బంధానికి దారితీయటం, 'ఒడ్డున పడ్డ చేపలు'లో యూనియన్ నాయకుల అడ్డదారి వ్యవహారాలు, 'ఆపద్బాంధవి'లో చదువుతో సాధించిన ఆత్మగౌరవం, మాదకద్రవ్యాల దుష్పరిణామాలు ఎన్నో సామాజిక సమస్యలపై ఈ కథాసంపుటి వైవిధ్యభరిత ఇతివృత్తాలతో రచయిత కథారూపాలను సృష్టించారు. బొంబాయి కథలు, బొంబాయి నానీలు, ముంబయి మువ్వలు, మనోల్ల ముంబయి కతలు, మహారాష్ట్రలో తెలుగు సాహిత్యానికి కీర్తిప్రతిష్ఠలు తెస్తున్న డా॥ అంబల్ల జనార్దన్ కథానికా సంపుటి చదువరులను ఆకట్టుకుంటుంది.

**(ప్రాణధార-రచన: డా॥ అంబల్ల జనార్దన్; వెల: రూ.300/-లు; ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, కాచీగూడ ఎక్స్ రోడ్స్, ఆర్య సమాజ్ ఎదురుగా, హైదరాబాద్)**

- జయసూర్య

# 29 మార్చి, 2026 నుండి 4 ఏప్రిల్, 2026 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్కురాలు
నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు,
గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1
ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం వినోద కార్యక్రమాలకు గాను ప్రాధాన్యత నిస్తారు. ఋణాలు ఇవ్వడం, తీసుకోవడం రెండూ కలిసి రావు. ఆంతరంగిక వర్గంలోనికి కొత్త వారికి చోటు కల్పిస్తారు. అయోమయ స్థితిలో ఉన్న వ్యవహారాలను ఓ కొలిక్కి తీసుకు రావడానికి గాను మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. సంఘ గౌరవం పెంపొందుతుంది. నిత్యం ఇష్టదైవం సన్నిధిలో అష్టమూలికా తైలంతో దీపారాధన చేయండి.

### వృషభం

ఈ వారం స్వల్ప ఒడిదుడుకులు ఏర్పడినప్పటికీ అవలీలగా అధిగమిస్తారు. ఆహార, ఆరోగ్య సూత్రాలను పాటించడం, వివాదాలలో జోక్యం చేసుకోకపోవడం మంచిది. అనవసర విషయాలతో కాలయాపన చేస్తున్న సన్నిహిత వర్గానికి హితవు పలుకుతారు. శుభకార్యాలలో, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. అష్టమూలికా తైలంతో లక్ష్మీతామర వత్తులను ఉంచి దీపారాధన చేయడం చెప్పదగిన సూచన.

### మిథునం

ఈ వారం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా ., ఋణాలు కొంత వరకు తీరుస్తారు. వివాదాలకు, కోపతాపాలకు దూరంగా వుండడం మంచిది. అష్టగణపతికి జిల్లేడు వత్తులతో ప్రతి రోజు పూజచేయటం వలన అన్ని విధాలా శ్రేయస్కరంగా వుంటుంది. బంధువుల నుండి అందిన సమాచారం ఆనందం కలిగిస్తుంది ఆకస్మిక ధనలాభం. గృహం, వాహనాలు కొనుగోలు యత్నాలు సాగిస్తారు. వృత్తి, వ్యాపారాలలో మెలకువ అవసరం.

### కర్కాటకం

ఈ వారం ముఖ్యమైన వ్యవహారాలలో ఆచితూచి వ్యవహరించండి. ఇతరుల విషయాలలో జోక్యం అనవసరం. చేపడుతున్న కార్యక్రమాలకు ఉన్నతాధికారుల అండదండలు లభిస్తాయి. కార్యాలయంలో మీ పరోక్షంలో జరుగుతున్న కొన్ని విషయాలు వెలుగుచూస్తాయి. రాజకీయ విభేదములకు ఆస్కార మున్నది. తండ్రి సమకాలీనులను కలుసుకుని వారి ఆశీర్వాదాలను అందుకుంటారు. శివాలయంలో రుద్రాభిషేకం చేయించండి.

### సింహం

ఈ వారం పనులలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు. ఆర్థిక లావాదేవీల్లో ఒడిదుడుకులను ఎదుర్కొన వలసి వస్తుంది. ఋణవత్తిడులు తప్పవు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. నిత్యం నాగసింధూరం ధరించండి. ఉద్యోగాలలో స్వల్ప మార్పులు చోటుచేసుకుంటాయి. రాజకీయ పారిశ్రామిక రంగాల వారికి కొంతలో కొంత మెరుగ్గా ఉంటుంది. జీవిత భాగస్వామ్య సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

### కన్య

ఈ వారం కోర్టు కేసులు వాయిదాలలో ఉంటాయి. మీకు రావలసిన ప్రయోజనాలను పోరాడి సాధించుకోవలసి వస్తుంది. ఇతరత్రా విషయాల ప్రభావం వృత్తి, వ్యాపారాల పైన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోగలుగుతారు. వ్యక్తిగత పురోభి వృద్ధికి ఉపకరించే అవకాశాలు అందివస్తాయి. సద్వినియోగ పరచుకోండి. స్పెక్యులేషన్ ఎంతమాత్రమూ లభించదు. సహోదర వర్గం వలన చికాకులు ఏర్పడతాయి. రచనా వ్యాసంగాలను సాగిస్తారు.

### తుల

ఈ వారం ఆర్థికపరిస్థితి మెరుగుపడుతుంది. దీర్ఘకాలిక ఋణాలు తీరతాయి. బాధ్యతలు సమర్థవంతం గా నిర్వహిస్తారు. గృహనిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి. సంఘంలో గౌరవం పెంపొందు తుంది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ముందుకు సాగుతారు. విద్య, ఉద్యోగ యత్నాలు కలిసి వస్తాయి. ప్రయత్నాలు ఫలిస్తాయి. సన్నిహితుల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. కోర్టు కేసులు తీరతాయి. నూతన సంస్థలు, పరిశ్రమలు ప్రారంభిస్తారు.

### వృశ్చికం

ఈ వారం ముఖ్యమైన పనులను పూర్తి చేయగలుగు తారు. విలువైన వస్తువుల, వాహనాల, స్థలాల, కొనుగోలు వ్యవహారాలు ఊపందుకుంటాయి. ఒకటికి మించిన వ్యాపారాలను ప్రారంభించడానికి గాను శ్రీకారం చుడతారు. తీర్థయాత్రలు చేస్తారు. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం. ప్రయాణాలు లాభసాటిగా సాగుతాయి. ప్రముఖులను కలుస్తారు. శుభకార్యాలను నిర్వహిస్తారు. మనస్సుకు ఊరట కలిగించే ఓ సంఘటన చోటు చేసుకుంటుంది. ఆరావళి కుంకుమతో లక్ష్మీదేవిని పూజించండి.

### ధనస్సు

ఈ వారం ఇంటాబయటా ప్రోత్సాహకరమైన పరిస్థితి వుంటుంది. సంఘసేవా కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడుపుతారు. జీవిత భాగస్వామి సహాయ సహకారాలను అందుకుంటారు. ఇంటర్వ్యూలకు హాజరవుతారు. వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధిని సాధిస్తారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. నిత్యం రుద్రకవచం పారాయణ చేయండి.

### మకరం

ఈ వారం కుటుంబ ఆరోగ్య సమస్యలు కొంత ఉపశమిస్తాయి. ముఖ్యమైన పనులు సన్నిహితుల సహకారంతో పూర్తి చేస్తారు. ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు. నూతన కార్యక్రమాలు చేపడతారు. గృహం, వాహన కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి. సోదరుల నుంచి ధనలాభం పొందుతారు. నూతన ఒప్పందాలు పరిష్కారం చేసుకోగలుగుతారు. ఎదుటి వారు మీరు చెప్పేది ఆసాంతం వినకుండా మీ మీద నిందలు వేయడం అసహనానికి గురి చేస్తుంది.

### కుంభం

ఈ వారం వత్తిడి నుండి బయటపడటానికి మీరు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ఇంటిలోని వారి సలహాలు, పెద్దల సహాయ సహకారాలు లభిస్తాయి. కొన్ని నిందలను మోయకతప్పని పరిస్థితి ఏర్పడే సూచనలున్నాయి. వృత్తి, ఉద్యోగ వ్యాపారాల పరంగా చెప్పుకోదగిన ఒడిదుడుకులేర్పడవు. చిన్నపాటి కొనుగోళ్ళను సాధిస్తారు. మీకు చేరువగా ఉంటూ.. మీ రహస్యాలను శత్రు వర్గానికి చేరవేసే వారి పట్ల అప్రమత్తంగా ఉండండి.

### మీనం

ఈ వారం మీరు తలపెట్టిన కార్యక్రమాలు విజయవంతమవుతాయి. సమాజంలో పలుకుబడి పెరుగుతుంది. నూతన కాంట్రాక్టులు లాభిస్తాయి. సాహిత్యకళారంగాలకు సంబంధించి కీర్తి ప్రతిష్ఠలు వస్తాయి. సంతానం విషయంగా కొంత ఆందోళన పడవలసి వస్తుంది. రావలసిన బాకీల కొరకు న్యాయ నిపుణుల సలహాలు అవసరమవుతాయి. నిత్యం ఆరావళి కుంకుమతో శ్రీ మహాలక్ష్మీ అమ్మవారిని పూజించండి.

# ఈ వారం కార్టూన్స్


వాళ్లు వేసుకునే బాంబులు
ఇక్కడి నుండే కనిపించవే..!!
Zakir


నిన్న నీవు బతికి ఉన్నట్టు ఉందయ్యా..!
కానీ ఈరోజు బతికి ఉన్నట్టు కావాలి..!!
-పెన్షన్లు-
Zakir...


గ్యాస్ వచ్చేవరకు బయటి నుండే
ఆర్డర్స్ పెట్టుకుంటాం.. తే బంగారం!!
Zakir...



స్లీప్‌లెస్ సిటీగా పిలవబడే పు క్వాక్ వియత్నాంలో ఉంది. ఈ నగరంలో ఎటు చూసినా నీటికాలువలు కనిపిస్తాయి. అందుకే దీనిని జలదారుల నగరమని పిలుస్తారు.



ఫోటో ఫీచర్

